ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
జూన్ 19, 2016

విరబూసిన మలర్

నాన్నా: ఐ లవ్ యూ

ENTERED
KSR02B126 C

టీవీ 2 బాలీవుడ్

షారుక్

ఆయుష్మాన్

యాక్టింగ్‌లో టాలెంట్‌ని చాటుకోడానికి ఎంతో మందికి టి.వి రంగం ప్లాట్ ఫామ్‌గా నిలిచింది. ప్రస్తుతం బాలీవుడ్‌లో బడా తారలు కొందరు ఒకప్పటి పాపులర్ టి.వి స్టార్ ఇమేజ్ ఉన్న వారే. ఈ టెల్లీ స్టార్ లిస్ట్‌లో ముందుంది మాత్రం మన బాలీవుడ్ 'బాద్‌షా' షారుఖ్. 1988లో 'దిల్ దరియా' సీరియల్‌తో నట ప్రస్థానం మొదలెట్టిన షారుక్ 'సర్కస్' సీరియల్‌తో మంచి నటుడిగా పేరు తెచ్చుకున్నాడు. రాజ్ కన్వర్ దర్శకత్వంలో 'దీవానా' సినిమాతో బాలీవుడ్‌లో అడుగుపెట్టాడు. విద్యాబాలన్ టీవీ సీరియల్స్‌తో పాపులరయ్యారు. ఏక్‌తా కపూర్ 'హమ్ పాంచ్' సీరియల్‌తో స్క్రీన్‌పై కనిపించిన విద్యా సినీ అవకాశాల కోసం చాలా కష్టపడ్డారు. తొలి చిత్రం 'పరిణీత' విద్యాబాలన్‌కి బాలీవుడ్‌లో క్రేజ్ తెచ్చిపెట్టింది. 'కిస్ దేశ్ మే హై మేరీ దిల్' సీరియల్ ద్వారా నటుడిగా పరిచయమయ్యాడు సుషాంత్ సింగ్ గ్రోవర్. 'కై పో చె' , 'డిటెక్టివ్ బ్యోంకేష్ భక్షి', 'పికె' చిత్రాలు సినిమా ఇమేజ్‌ని అందించాయి. దక్షిణాది తారల్లో అగ్రనటిగా గుర్తింపు తెచ్చుకున్న హన్సిక 'షకలక బూమ్ బూమ్' టీవీ షోలో బాలనటి. హిమేష్‌తో కలిసి నటించిన 'ఆప్‌కా సరూర్' సినిమా తనకి మంచి బ్రేక్‌నిచ్చింది. పాపులర్ టీవీ సీరియల్ 'క్యూంకి సాస్ బీ కభీ బహు థీ' నటుడు పులకిత్ సమ్రాట్, బిగ్‌బాస్ సీజన్-8 ఫేమ్ 'కరిష్మా తన్నా' బాలీవుడ్‌లో బిపాసకి జోడీగా ఎక్కువ సినిమాలు చేసిన కరణ్ సింగ్ గ్రోవర్, 'వన్స్ అపాన్ ఇన్ ముంబై' ఫేమ్ ప్రాచీ దేశాయ్, '2 స్టేట్స్' లో నటించిన రోహిత్ రాయ్, సనా ఖాన్, రాజీవ్ ఖన్డేవాల్, ఆయుష్మాన్ ఖురానా అందరూ టెల్లీ గల్లీ నుండి బాలీవుడ్‌లోకి అడుగుపెట్టిన వారే!

కరణ్ సింగ్

ప్రాచీ

విద్యా బాలన్

హన్సిక

కరిష్మా తన్నా

KSR02 B126
ENTERED

విరబూసిన మలర్

రోగులకు సేవ చేయాలి... తల్లిదండ్రుల కోరిక నెరవేర్చాలి.. ఈ రెండే ఆమెను డాక్టర్ చదివేలా చేశాయి. కానీ మధ్యలో యాక్టర్ అయింది. 'మలర్' నటన జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చింది. మేకప్ లేకుండా వేసిన పాత్రే పాపులార్టీ తెచ్చిపెట్టింది. అవకాశాలు కుప్పలు తెప్పలుగా వచ్చినా లక్ష్యం కోసం వైద్యురాలైంది. నటన వైపు ఇప్పుడు మళ్లీ అడుగులు వేస్తోంది ఈ 'ప్రేమమ్' లెక్చరర్ సాయి పల్లవి.

సాయి పల్లవి కోయంబత్తూర్‌కు సమీపంలోని కోటగిరిలో 1992 మే తొమ్మిదో తేదీన జన్మించింది. సాయిపల్లవి, తన చెల్లి పూజా ఇద్దరూ కవలలు.

- 2008లో విజయ టీవీలో 'ఉంగాలిల్ యార్ అదుత ప్రభుదేవా' పేరిట నిర్వహించిన డ్యాన్స్ రియాల్టీ షోలో పాల్గొంది. ఆ షోలో ఈమె పెర్ఫార్మెన్స్‌తో చాలా పాపులర్ అయిపోయింది. తర్వాత తెలుగులో 'ఈ టీవీ' నిర్వహించిన ఢీ-4 డ్యాన్స్ షోలో కూడా తన డ్యాన్స్‌తో మెరిపించింది.
- ఆ ఏడాది తమిళంలో జీవ దర్శకత్వంలో తీసిన 'ధామ్ ధూమ్' అనే రొమాంటిక్ థ్రిల్లర్ చిత్రంలో చేసింది. ఈ చిత్రంలో జయం రవి, కంగనా రనౌత్ హీరో హీరోయిన్లు. కంగనాకు సాయిపల్లవి స్నేహితురాలి పాత్రలో నటించింది. ఆ సినిమాలో ఆమె చేసిన పాత్ర చిన్నదే కావడంతో అంతగా గుర్తింపు లభించలేదు.
- తర్వాత తన మెడిసిన్ చదువుపై శ్రద్ధ పెట్టింది. చాలా కాలం తర్వాత 2015లో దర్శకుడు ఆల్ఫోన్స్ పుతరెన్ నుంచి ఫోన్ వచ్చింది. ఆయన చేయబోయే చిత్రంలో లెక్చరర్ పాత్ర చేస్తావా? అని అడిగారు. మొదట్లో సాయి పల్లవి ఆ పాత్ర చేసేందుకు నిరాకరించింది. చదువు దెబ్బ తింటుందని భయపడింది.
- డ్యాన్స్‌ను ఎంతగానో ఇష్టపడే ఈమె ఈ అవకాశం కోసమే రియాల్టీ షోల్లో పాల్గొంది. అటువంటిది ఓ దర్శకుడే నేరుగా తనను అడిగాక చేయనంటే మళ్లీ అవకాశాలు రావేమోనని భయమో ఏమో గానీ తర్వాత గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. ఇలా 'ప్రేమమ్' సినిమాలో మలర్ పాత్ర చేసే అవకాశం వచ్చింది.
- 'ప్రేమమ్' సినిమాలో తన పాత్ర వరకూ షూటింగ్ పూర్తయిపోయిన వెంటనే మళ్లీ తన చదువుపై దృష్టి సారించింది. ఆమె చిత్ర సీమకు దూరంగా జార్జియాలో ఉన్నా 'ప్రేమమ్'లో ఈమె చేసిన పాత్ర గురించి చిత్ర సీమలో పెద్ద చర్చే జరిగింది. ఆ పాత్రతో ఈ డాక్టర్ పెద్ద యాక్టర్ కన్నా ఫేమస్ అయిపోయింది. కోట్లాది మంది ప్రేక్షకుల్లో ఆమె మలర్‌గానే గుర్తింపు లభించింది.
- ఒకటా రెండా ఏకంగా నాలుగు అవార్డులు ఈ చిత్రంలో చేసినందుకే వచ్చాయి. స్పెషల్ జ్యూరీ విభాగంలో ఏసియా నెట్ ఫిల్మ్ యాక్టింగ్‌లో సంచలనం సృష్టించినందుకు గాను ఆసియా విజన్ అవార్డు, ఉత్తమ నటిగా వనితా ఫిల్మ్ అవార్డు, ఐబీఎన్ లైవ్ ఛానల్ ప్రకటించిన బెస్ట్ సదరన్ డెబ్యూట్ అవార్డు వరించాయి.
- హీరో కార్తీతో మణిరత్నం తీయనున్న చిత్రంలో సాయి పల్లవిని ముందు అడిగారు. ఆమెకు కథ కూడా చెప్పారు. కానీ ఏదో విషయంలో విభేదం వచ్చి ఆ సినిమా చేయడానికి పల్లవి నిరాకరించింది.
- మలర్ అంటే చిన్ని పువ్వు అని అర్థం. ఈ మలర్ ఫీవర్ కేవలం మలయాళీ కుర్రాళ్ల వరకే ఆగలేదు. భాష అర్థమైనా కాకున్నా కేవలం మలర్ పాత్ర కోసమే చాలామంది తెలుగు కుర్రాళ్లు 'ప్రేమమ్' చిత్రాన్ని తెగ చూసేశారు. చాలా సాదా సీదా ఆహార్యంతో అంతగా ఆకట్టుకుంది సాయి పల్లవి.
- 'ప్రేమమ్'లో అప్పటి వరకు హుందాగా లెక్చరర్ పాత్రలో కనిపించే మలర్ స్టూడెంట్ ప్రోగ్రామ్ కోసం కొన్ని స్టెప్పుల్ని వేసి చూపిస్తుంది. ఆమె వేసే ఆ నాలుగు స్టెప్పులే థియేటర్లను దద్దరిల్లించాయి. అంత మంచి డ్యాన్సర్. ఎప్పటికైనా డ్యాన్స్‌లో కొత్తగా ఏదైనా చేయాలన్నది ఆమె కోరికని చెప్పింది.
- సినిమా రంగానికి సంబంధం లేని కుటుంబం నుంచి వచ్చిన సాయి పల్లవి మలర్‌తో పాటు అంజలి (కలి) పాత్రకి జీవం పోయడానికి కారణం ఆమె జీవితానికవి దగ్గరగా ఉండటమేనని ఓ ఇంటర్వ్యూలో చెప్పింది.
- మమ్ముట్టి కొడుకు దుల్కర్ రెహ్మాన్‌తో కలసి 'కలి'లో నటించింది. ఈ చిత్రం అయ్యాక సినిమాలకు బ్రేక్ తీసుకుంది. వైద్య విద్య పూర్తి చేశాకే మరో ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలని నిశ్చయించుకుని పూర్తిగా చదువుపై దృష్టి పెట్టింది. ఇటీవలే యూరప్‌లోని జార్జియాలో ట్బిల్లిసి స్టేట్ మెడికల్ యూనివర్సిటీలో నుంచి డాక్టర్ పట్టా పొందింది. ఇప్పుడు మళ్లీ సినిమాలపై దృష్టి సారించింది.
- అస్సలు మేకప్ లేకుండానే 'ప్రేమమ్'తోపాటు 'కలి' చిత్రంలో చేసిన ఆమె పాత్ర కూడా ఎంతో గుర్తింపునిచ్చింది.
- శేఖర్ కమ్ముల దర్శకత్వంలో వరుణ్ తేజ్ హీరోగా తెరకెక్కనున్న 'అమెరికా అబ్బాయి-తెలంగాణా అమ్మాయి' చిత్రంలో సాయి పల్లవే హీరోయిన్. ఈ చిత్రం ద్వారా తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరవనుంది.

- కొప్పుసెట్టి దేవరాజు

సందర్భం................3
క్రీడా స్ఫూర్తికి కాగడా
జీవితం..............4
రెయిన్‌డీర్ మనుషులు
కార్టూన్ పంచ్......... 5
వింతలోకం...................10
సమాధి తవ్వే పోటీ
విజేత..............11
భారత తొలి మహిళా గోల్ఫర్
కొత్త పుస్తకాలు................14
సంబంధాల సంఘర్షణ

ఇండెక్స్

నాన్నా..ఐ లవ్ యూ..

అట్టమీది కథ...6

సేవ...................15
ఆకలి తీరుస్తోన్న 'రాబిన్‌హుడ్'
యువ 16
బాలికల రక్షకి
కథ...............18
నమ్మకం
రుచి....................21
బ్రెడ్ రోల్స్
బాల నేస్తాలు.............23
బుజ్జి పాండా కావాలా !
పద వికాసం.........24

వివరం - 12
ఇవేం 'తిండి' గొడవలు !

యదార్థ చిత్రం

షార్ట్ ఫిల్మ్, సినిమా, డాక్యుమెంటరీ మధ్య వ్యత్యాసాలను, డాక్యుమెంటరీల పుట్టుకకు సంబంధించిన విషయాలను తెలిపిన యదార్థ చిత్రం ఆకట్టుకుంది. దేశాలు తిరుగుతూ మెక్సికోలో స్థిరపడి ప్లాస్టిక్ వ్యర్థాలతో తేలియాడే గృహాలను నిర్మించడం అద్భుతం. కారు బొమ్మల ప్రయాణం, ఆల్ గాళ్స్ బ్యాండ్, ప్రియ వదనే, తల్లిలాంటి మార్కెట్ బాగున్నాయి. మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో కపడా బ్యాంక్‌ని స్థాపించారు. అలాంటి వారిని ఆదర్శంగా తీసుకుని ఇప్పుడిప్పుడే హైదరాబాద్ వంటి పట్టణాల్లోనూ కొన్ని కపడా బ్యాంక్‌లు రూపుదిద్దుకోవడం అభినందనీయం.

- సింధూష, ఒంగోలు

ఆకట్టుకున్న చదువంటే ఇదీ

చదువు భారం కాకుండా ఆటపాటలతో వినోదాన్ని, విజ్ఞానాన్ని పంచుతున్న ఫిన్‌ల్యాండ్ విద్యావిధానం మన దేశంలో కూడా రావాలని ఆకాంక్షిస్తున్నాం. పిల్లలతో పాటు టీచర్లకీ పని వత్తిడి లేకుండా చేస్తూ, పిల్లలకి సమకాలీన అంశాలు బోధిస్తున్న తీరు ఆకట్టుకుంది. ఉప్పు కయ్యల్లో పనిచేసే కార్మికులకు టాయిలెట్లు లేకపోవడం బాధాకరం. వారి సమస్యకి చక్కటి పరిష్కారాన్ని కనిపెట్టిన సోనమ్‌కి

అభినందనలు. రోలర్ కోస్టర్ రెస్టారెంట్, భాషని మార్చే పైలట్, శ్మశానంలో పిక్నిక్ ఆకట్టుకున్నాయి.

- వనజ, అనంతపురం

పూలహారాలు

పెండెంట్‌లో పూల హారాలను ఎంతో అందంగా అమర్చారు ఆడియానే. కార్పొరేట్ కళాశాలల మోజులో పడి ఎంతో మంది తల్లిదండ్రులు తమ పిల్లల్ని కోల్పోతున్నారు. అలాంటి విషయాలను నా బిడ్డ నాకు చాలు కథ ద్వారా కళ్లకి కట్టినట్టు చూపించారు. విద్యా విధానం ఎలా ఉండాలో తెలిపే ఇదీ చదువంటే ఆకట్టుకుంది. సింగర్స్‌తో పాటు, మ్యూజిషియన్లుగానూ మహిళలే ఉన్న 'ఆల్ గాళ్స్ బ్యాండ్', టిప్పీ జంగిల్ బుక్, తేలియాడే దీవ్రం, కార్టూన్ పంచ్, జోక్స్ బాగున్నాయి.

- వినయ్ కుమార్, అనపర్తి

మహిళా మార్కెట్

మణిపూర్‌లో 5 శతాబ్దాలుగా మహిళలచే నడపబడుతున్న మహిళా మార్కెట్ ప్రస్తుతం 5 వేల మంది మహిళలతో ప్రపంచంలోనే అతిపెద్ద మహిళా మార్కెట్‌గా పేరు గడించడం అభినందనీయం. డాక్యుమెంటరీ చిత్రాల సమాహారం యదార్థ చిత్రం, ఈ దాహార్తి వేరే, చదువంటే ఇదీ, తేలియాడే దీవ్రం, నా బిడ్డ నాకు చాలు కథ చదివించాయి.

- జాహ్నవి, కడప

కపడా బ్యాంక్

కపడా బ్యాంక్ గురించి చదివి చలించిపోయాను. యూసఫ్ కపడా బ్యాంక్ స్థాపించడం చాలా అబ్బురమైన విషయం. పేదల పెన్నిధిగా మూసా సేవకి మరికొందరు జతకావడం ఆనందించదగ్గ విషయం. బీదవారిని ఆదుకునే వారు కరువౌతున్న ప్రస్తుత పరిస్థితుల్లో యూసఫ్ సేవా తత్పరత అభినందనీయం. ప్రతి ఒక్కరూ దుస్తుల్ని పడేయకుండా ఇలాంటి కపడా బ్యాంకులకు అందించాలి.

-కైప నాగరాజు, అనంతపురం

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ. -520002.
మెయిల్ అడ్రస్: snehaweekly.praja@gmail.com

ఓ శరణార్థి నడక ఎటు పోతుందో ఆ ముళ్ల బాటకే తెలీదు. కానీ ఓ సిరియా శరణార్థి నడక రియో ఒలంపిక్ జ్యోతిని పట్టుకుని గ్రీస్‌లో వెలిగింది. ఒలంపిక్ క్రీడలకు జన్మనిచ్చిన నేలపై ఆ వికలాంగ క్రీడాకారుని దీక్ష తిరగాడింది. ఎప్పటికైనా తన కెరీర్‌లో ఒలంపిక్స్ ఈత పోటీల్లో ప్రాతినిథ్యం వహించాలనుకున్న ఇబ్రహీం అల్ హుస్సేన్ ఓ బాంబ్ దాడిలో కాలు పోగొట్టుకున్నాడు. కానీ కలను మరవకుండా ప్రయత్నిస్తోన్న అతడీ స్ఫూర్తిదాయక కథ ఇదే.



క్రీడా స్ఫూర్తికి కాగడా

ఇబ్రహీం అల్ హుస్సేన్ తన దేశానికి ప్రాతినిథ్యం వహించలేదు. తన క్యాంపు వారికి ప్రాతినిథ్యం వహించలేదు. ప్రపంచంలోని యావత్తు శరణార్థులకూ ఆయన ప్రతినిధి. గ్రీస్ గుండా యూరప్‌లో ఆశ్రయం పొందేందుకు వేల మైళ్ల దూరం కాలి బాట పట్టిన సిరియా శరణార్థుల కలలకు ప్రతీక మాత్రమే కాదు ప్రపంచ యుద్ధాల కాలం నుంచి ఇప్పటి రాక్షస యుద్ధ క్రీడలో బలైపోతోన్న బడుగు దేశాల శరణార్థుల క్రీడా స్ఫూర్తికి కాగడా. ఇబ్రహీం పన్నెండేళ్ల క్రితం ఏథెన్స్ ఒలంపిక్స్‌ను ఇంట్లో టీవీలో చూసి ఆస్వాదించాడు. ప్రభావితుడయ్యాడు. కార్యోన్ముఖుడయ్యాడు. ఇప్పుడు అదే ఏథెన్స్ దగ్గరి ప్రాంతంలో ఓ శరణార్థి శిబిరంలో భవిష్యత్తు భయాల మధ్య వీక్షించనున్నాడు. ఏథెన్స్ ఒలంపిక్స్ తర్వాత పోటీల కల్లా జూడోలో నిష్ణాతుడయ్యాడు. గత బీజింగ్ ఒలంపిక్స్ కల్లా దేశంతో పాటు తన కలా తలకిందులైపోయింది. సిరియా యుద్ధ సంక్షోభంలో చితికిపోయిన కోట్లాది మంది బతుకు కథలో ఇబ్రహీమ్‌ది ఒకటి. 22 ఏళ్లుగా ఓ అథ్లెట్‌గా అతడి జీవితం ట్రాక్ తప్పిపోయింది. బాంబ్ దాడిలో కాలు తెగిపడింది. అయినా ఇబ్రహీం కార్యదీక్ష ముందు ఆ దాడి మట్టికొట్టుకుపోయింది. 27 ఏళ్ల ఈ ఫ్రీ స్టైల్ ఈతగాడు కృత్రిమ కాలు సాయంతో బాస్కెట్ బాల్ కోర్టులోను చురుగ్గా కదులుతున్నాడు. జూడో రెజ్లర్‌గా మంచి గుర్తింపు పొందిన ఈ మిక్స్‌డ్ స్పోర్ట్ పర్సనాలిటీ ఆ యుద్ధ కళలోని పోరాటాన్ని జీవితానికి అన్వయించుకున్నాడు.

సిరియాలోని యూఫ్రటిస్ నదీపరీవాహక ప్రాంతంలోని డైర్ ఎజ్జోర్ నగరంలో పెరిగిన ఇబ్రహీం 5 ఏళ్ల వయస్సు నుంచే తండ్రి వద్ద ఈతలో శిక్షణ తీసుకున్నాడు. ఇబ్రహీం బంధువుల్లో 13 మంది ఈత పోటీదారులున్నారు. ఈత పోటీలతో అంత దగ్గరి స్నేహం ఆ కుటుంబానికి. ఇంటి నుంచి కేవలం 10 నిమిషాల దూరంలో ఉండేది నది. ప్రతి రోజు 5-10 కిలోమీటర్లు ఈదులాడేవాడు ఇబ్రహీం. దగ్గరలోని సస్పెన్షన్ బ్రిడ్జి మీద నుంచి స్నేహితులతో కలసి



నదిలోకి డైవ్ చేసి కేరింతలు కొట్టేవాడు. ఈతకు సంబంధించి ఏ విన్యాసమైనా ఇబ్రహీంకు ప్రాణం. ఏథెన్స్ ఒలంపిక్స్ (2004) ఈత పోటీల్ని సునిశితంగా గమనించేవాడు. ఎప్పటికైనా ఒలంపిక్స్ స్విమ్మింగ్ పూల్‌లో శరీరాన్ని ఆడించాలనేది లక్ష్యం చేసుకున్నదప్పుడే. ఆ ప్రయత్నంలో ఉండగానే సిరియా సంక్షోభం తీవ్రమైంది. 2012లో జరిగిన ఓ బాంబ్ దాడిలో కుడి కాలిని కోల్పోయాడు. తన ఊరి వారితో కలసి టర్కీకి శరణార్థిగా చేరాడు. ఓ రబ్బర్ డింగీలో 16 మంది శరణార్థులతో కలసి సముద్రాన్ని దాటే సాహసం చేయాల్సొచ్చింది. 2014లో తూర్పు గ్రీక్ ద్వీపం సామోస్‌కు చేరిన ఇబ్రహీం గ్రీస్‌లో ఆశ్రయం పొందాలని భావించాడు. అప్పటికే గ్రీస్ ఆర్థిక సంక్షోభంతో నలిగిపోతోంది. చాలామంది మిత్రులు, బంధువులు మిగతా యూరప్ దేశాలకు వెళ్లిపోతుంటే ఇబ్రహీం మాత్రం గ్రీస్‌లో ఉండిపోయాడు. అదే అతడి జీవితంలో కొత్త ఆశలు చిగురింపజేసింది. ఇబ్రహీం క్రీడా ప్రతిభ తెలుసుకున్న ఓ ఏథెన్స్ క్రీడా క్లబ్ అతడిని ఆహ్వానించింది. ఉద్యోగం కూడా దొరకడంతో అతడి ప్రాక్టీస్‌ను క్లబ్ సాయంతో కొనసాగించాడు. ఓ కెఫెటేరియాలో పది గంటల షిఫ్టులో పని చేసుకుంటూ ఈత ప్రాక్టీస్ చేస్తున్నాడు. బాస్కెట్ బాల్‌పై కూడా మక్కువ వదులుకోకుండా వీల్‌చెయిర్ విభాగంలో దూసుకెళుతున్నాడు. ఆ పట్టుదలను చూసే గ్రీస్ ఒలంపిక్ కమిటీ ఒలంపిక్ జ్యోతిని అందుకునే అవకాశాన్ని కల్పించింది. ఆ దేశ ఒలంపిక్ కమిటీ అధ్యక్షుడు స్పైరోస్ క్యాప్రలోస్ నుంచి నేరుగా అందుకుని ఏథెన్స్‌లోని ఇలైయోనస్ క్యాంప్‌లో పరుగు తీశాడు. ఇదే కాదు తొలిసారిగా ఒలంపిక్స్ శరణార్థుల జట్టును పోటీల్లో అనుమతిస్తున్నారు. వీరికి శిక్షణ, సదుపాయాలన్నింటినీ ఒలంపిక్స్ కమిటీనే చూసుకుంది.

-జే

ఈ భూమ్మీద చివరి రెయిన్‌డీర్ మనిషి ఎక్కడున్నాడో తెలుసా? మొత్తం 500 మంది ఉన్న ఆ తెగ అంతమయ్యేందుకు కారణం తెలుసా? ట్సాటాన్ తెగగా పిలిచే మంగోలు సొంత మనిషిని పలకరిస్తే.. ఆటవికానికి, ఆదిమ జాతులకు తేడా తెలుస్తుంది. రెయిన్‌డీర్‌లను పెంచుకుంటూ తిరిగే ఈ సంచార జాతి ఆ తరహాలో చిట్టచివరిది. వారి మనుగడ, జీవనం గురించి కొన్ని విశేషాలు..

రెయిన్‌డీర్ మనుషులు

జీవితం



మంగోలియా సరిహద్దున గల తువా ప్రాంతానికి చెందిన వీళ్లని దుఖాస్ అని కూడా పిలుస్తారు. ట్సాగాన్ నూర్ సరస్సు వద్ద కేంద్రీకృతమైన వీరి జీవనం ఎక్కువగా రుతువులను అనుసరించి టైగా, ఉలెన్ బేటర్ ప్రాంతాలకు సంచారం పోతుంది. రెయిన్‌డీర్‌ల మీదే వీరి జీవనం ఆధారపడి ఉంటుంది. వీళ్లు వాటి మాంసాన్ని తినరు. రెయిన్‌డీర్ పాలతో చేసే జున్నే వీరి ప్రధాన ఆహారం. రెయిన్‌డీర్‌లతోనే వారి సంస్కృతి ముడిపడి ఉంటుంది. ఒకవేళ అవి అంతరించిపోతే దుఖాస్ అనే మాట కొన్ని తరాల్లోనే వినబడదు. వాటిని కుటుంబ సభ్యులుగా చూసుకుంటారు. గౌరవిస్తారు. వాటి పెంపకమే వారి ప్రపంచం. ఏడెనిమిది కుటుంబాలు టెంట్లను దగ్గరిదగ్గరిగా వేసుకుని గడుపుతుంటారు. ఈ సముదాయాల్ని ఓలాలాల్ అని పిలుస్తారు. అక్కడ రెయిన్‌డీర్లకు గడ్డి అయిపోగానే మరో చోటకు కదిలిపోతారు. ఆ సంచారంలో పిల్లల్ని కనడం పెద్ద చేయడం జరిగిపోతుంది. చిన్నతనం నుంచే రెయిన్‌డీర్లతో మాలిమి ఉంటుంది. వాటిని మేతకు తీసుకెళ్లడం, సంరక్షించుకోవడం వారికి జీవిత పాఠాలు. చలి కాలంలో మిగతా కుటుంబాలన్నీ వెచ్చటి ప్రాంతాలకు తరలిపోతే రెయిన్‌డీర్లతో కలసి కొంత మంది ఉంటారు. తోడేళ్ల బెడద ఎక్కువగా ఉండటంతో వీరు రాత్రుళ్లు కూడా రెయిన్‌డీర్లతోనే గడుపుతారు. రెయిన్‌డీర్‌లు లాగే బళ్లు వీరి వాహనాలు. మీకు వెంటనే శాంటా క్లాస్ గుర్తొచ్చేసుంటాడు కదా. రెయిన్‌డీర్ల మాంసాన్ని ముట్టని వీళ్లు మిగతా అడవి జంతువుల్ని వేటాడతారు. అయితే చలికి రక్షణగా వాడే కొన్ని దుస్తులకు మాత్రం వాటి చర్మాన్ని వినియోగిస్తారు. పిల్లల స్వారీ చేసే రెయిన్‌డీర్లు రెండేళ్ల వయస్సు కలిగి ఉంటాయి. వీటిని డోంగోర్ అని పిలుస్తారు. పెద్దలకు మూడేళ్ల కన్నా ఎక్కువ వయస్సున్న హూడై రెయిన్‌డీర్లను ఉపయోగిస్తారు.

వందల ఏళ్ల నుంచి చైనా, మంగోలియన్ వర్తకులతో పరిచయాలున్నా ఇప్పటికీ వీరికి శాశ్వత నివాస ప్రాంతాలంటూ లేవు. రైఫిళ్లను వాడటం కూడా వచ్చినా ఇంకా సంచార జీవనాన్నే ఇష్టపడతారు. జూన్ మొదలు వీరు వేసవి క్యాంపులైన సముద్ర మట్టానికి 2300 మీటర్ల ఎత్తులో ఉండే ప్రాంతాలకు చేరుకుంటారు. ఆగస్ట్ నెలలో దిగువ ప్రాంతాలకు వచ్చేస్తారు. ఇలా మారడానికి ప్రధాన కారణం రెయిన్‌డీర్లే. అవి ఉష్ణాన్ని అస్సలు తట్టుకోలేవు. వాటికి అనుకూలంగా ఉండేందుకే ఈ సంచారం. దట్టమైన అటవీ ప్రాంతాల్లో ఉండేందుకే దుఖాలు ఇష్టపడతారు. బలమైన చలి గాలుల నుంచి రక్షణ పొందేందుకే ఒక ప్రాంతంలో నెలకు మించి ఉండరు. మంచు పరుచుకున్నా కూడా రెయిన్‌డీర్లు మేతను పొందగలవు. వాటి కొమ్ములతో మంచును తొలగించి నాచును తింటాయవి. మంచు కురిసే కాలంలో ఒటోర్ అనే పద్ధతి పాటిస్తారు. రెయిన్‌డీర్లను ఎంత దూరాలకైనా వాటికి స్వేచ్ఛకు వదిలేసి కొంత మంది యువకులను కాపుగా ఉంచుతారు. తీవ్ర వాతావరణ పరిస్థితులపుడు యుర్త్‌లనే ఇళ్లను ఏర్పాటు చేసుకుంటారు. ఒక్కో యుర్త్‌కు 32 చెట్ల కలప అవసరమవుతుంది. ఉష్ణాన్ని పట్టి ఉంచేందుకు వాటి మధ్యగా పొయ్యిను ఏర్పాటు చేసుకుంటారు. నేల మీదే దట్టంగా జంతువుల చర్మాల్ని పరచి నిద్రపోతారు. శరీరాన్నంతటినీ కప్పేసే లాంగ్ కోట్‌లాంటి వస్త్రాలను ధరిస్తారు. రెయిన్‌డీర్ కాలిమట్టెలను పోలి ఉండే బూట్లను ధరిస్తారు. ఇవి మంచు నేల నుంచి రక్షణనిస్తాయి. ప్రకృతి ఆరాధకులైన దుఖాలు వారి పూర్వీకుల ఆత్మలు అడవిలోని జంతువుల్లా సంచరిస్తాయని నమ్మి వాటిని కొలుస్తారు. వీరి దేవుడు 'బూ'. ఆధ్యాత్మిక, మత గ్రంథాలు కూడా వీరికున్నాయి. వేటాడటానికి, వర్షం రాకడ, పోకడలకు చెందిన గ్రంథాలున్నాయి. వీరి ప్రత్యేక పానీయం 'సూటై ట్సాయ్'. రెయిన్‌డీర్ పాలతో చేసే ఉప్పగా ఉండే తేనీరిది. సబ్ ఆర్కిటిక్ మంచు ప్రాంతంలో మనుగడ కష్టసాధ్యమైన ప్రాంతంలో రెయిన్‌డీర్ల మీద ఆధారపడి బతుకుతున్న దుఖాలది ప్రశాంత జీవనం. వారు అల్పసంతోషులు. పిల్లలు, రెయిన్‌డీర్లు ఈ రెండే వారి లోకం, ఆస్తి, సంతోషాల నిధి.

కార్టూన్ పంచ్





నవ్వుల్ - పువ్వుల్

అప్పు

సుబ్బు హోటల్‌లోకి వెళ్ళాడు. ఎడమవైపు వెజ్, కుడివైపు నాన్‌వెజ్ బోర్డులు చూసి కుడివైపు తలుపు తీసుకుని లోపలికి వెళ్ళాడు. అక్కడ రెండు బోర్డులున్నాయి. ఒకటి సర్వింగ్, రెండోది బఫే. బఫే బాగుంటుందని ఆ సెక్షన్‌లోకి అడుగుపెడితే అక్కడ ఒక తలుపు మీద క్యాష్, మరో తలుపు మీద అప్పు అని రాసుంది. అప్పు తలుపు తీసుకుని వెళ్ళి తీస్తే హోటల్ నుండి బయటికి దారి కనిపించింది.

మెసేజ్

ఒకబ్బాయి ప్రేమలో పడ్డాడు. ఆ విషయం ఆ అమ్మాయికి చెప్పడానికి ధైర్యం చాల్లేదు.

ఒక రోజు ధైర్యం చేసి ఐలవ్ యూ అని టైప్ చేసి రిప్లై కోసం వెయిట్ చేస్తున్నాను.. అని రాసి మెసేజ్ పెట్టాడు. వెంటనే మొబైల్‌కి మెసేజ్ వచ్చింది.

మెసేజ్ చూడ్డానికి చాలా టెన్షన్ పడ్డాడు. ఇప్పుడు చూడ్డం ఎందుకు పొద్దున్నే లేచి చూద్దామని పడుకున్నాడు.

ఆ మెసేజ్ ఇలా ఉంది.

dear customer... you have insufficient balance to send this message. pls recharge your account and try again.



కొబ్బరి చెట్టు

ఆనంద్: ప్రీతి నువ్వు నన్ను ప్రేమించకపోతే చెప్పు.. ఆ కొబ్బరి చెట్టెక్కుతా!

ప్రీతి: ఏమిటీ... బెదిరిస్తున్నావా.?

ఆనంద్: అదేం కాదు.. కొబ్బరి చెట్టెక్కితే ఇంజనీరింగ్ కాలేజీ అమ్మాయిలు కనిపిస్తారు. వాళ్లలో నచ్చిన అమ్మాయిని వెతుక్కుంటా!

ప్రీతి: ఎక్కాక చేతులు వదిలెయ్, మెడికల్ కాలేజీ అమ్మాయిల్ని చూడొచ్చు...!



నాన్నా.. ఐ లవ్ యూ..

కన్న పేగు ప్రేమ అమ్మదైతే.. కను రెప్ప రక్ష నాన్నది. అమ్మ ఒడి గుడి అయితే నాన్న భుజం లోకాన్ని చూపే బడి. అమ్మ జోల పాట ఎలాగో నాన్న నీతి పాఠం అలాగ. నాది అని బిడ్డ భావించే ప్రతి దానికి పునాదిగా ఉండి సాధనకు తోడ్పడేవి బాల్యంలో తండ్రితో కలసి ప్రేరణ పొందిన మధుర క్షణాలే. లోకంలో ఏ నాన్న కైనా కన్నబిడ్డల తోటే లోకం. కాలం బాట మీద కనిపించని సాధకుడు నాన్న. జూన్ 19 పితృ దినోత్సవం సందర్భంగా అట్టమీది కథ.

- బెందాళం క్రిష్ణారావు
7306434888

"నాన్న"…..అనే పదం. 'అమ్మ' అనే పదం తర్వాతదైనా ప్రతీ ఒక్కరి జీవితంలో ఒక అపురూపమైన భావన. 'అమ్మ' వాస్తవం, 'నాన్న' నమ్మకం అంటారు. నవ మాసాలూ మోసి ఎంతో ప్రసవ వేదననుభవించి ఒక శిశువును తల్లి భూమి మీదకు తీసుకొస్తే.. ఆ శిశువు యుక్తవయసుకు వచ్చే వరకూ, ప్రయోజకులుగా బిడ్డల్ని తీర్చిదిద్దే వరకూ కంటికి రెప్పలా భరోసాగా నిలిచేది కన్న తండ్రి లాలించి.. లాలపోసి.. అడుగులేయించి.. అక్షరాలు పలికించి అన్నీ తానై తోడూ నీడగా ఉండే 'నాన్న'కు ప్రతి ఒక్కరి జీవితంలో ప్రత్యేక స్థానముంటుంది. చిన్నతనంలో నాన్న చెప్పుల జతలో తప్పటడుగులతోనే ఏ బిడ్డయినా జీవిత పరుగు పందాన్ని మొదలు పెడుతుంది. ఉద్యోగం, ఉపాధి అంటూ ఉదయాన్నే లేచి వెళ్లే 'నాన్న'.. ఇంటి పట్టున ఉండలేడు. కంటి నిండా నిద్రపోలేడు. ఇంటి బాధ్యతలను ఒంటి స్తంభంలా మోస్తూ తన సంపాదనంతా కుటుంబానికే వెచ్చిస్తాడు. పిల్లల భవిష్యత్తు కోసం వారిని కష్టపెట్టినా అది వారి ఉన్నతి కోసమే. నాన్న అనురాగానికీ, ఆప్యాయతలకు ప్రతీక మాత్రమే కాదు. మార్గదర్శిగా ఉంటూ పిల్లల బంగారు భవితకు బాటలు వేయడానికి నిరంతరం తపన పడుతుంటాడు. పెళ్లయి అత్తారింటికి వెళ్లినా ఆడపిల్లకు తండ్రి లాలన పట్లే మక్కువ ఎక్కువ. ఉద్యోగాలొచ్చి ఎక్కడెక్కడో స్థిరపడే మగ పిల్లలను కూడా బాల్యంలో తండ్రి నేర్పిన క్రమశిక్షణే ముందుకు నడిపిస్తుంది.

ఆత్మీయతకు ఆలంబనై..

ప్రస్తుత సమాజంలో కుటుంబ నిర్వహణలో అమ్మతోపాటు బాధ్యతలను పంచుకోవడానికి నాన్న పోటీ పడుతున్నాడు. వంట పనిలో, ఇంటి పనిలో అమ్మకు చేదోడు వాదోడుగా ఉంటూ పిల్లల సంరక్షణలో తన వంతు సహాయం చేసేందుకు నాన్న సిద్ధంగా ఉండటాన్ని నేడు చాలా ఇళ్లలో చూస్తున్నాం. వంట పనిలో అమ్మ బిజీగా ఉంటే పిల్లల్ని నిద్ర లేపడం, స్నానం చేయించడం, వారిని స్కూల్‌కు సిద్ధం చేయడంలో నాన్న

క్రమశిక్షణ నేర్పించే నాన్న

అమ్మ ఆలనా పాలనా చూసుకుంటే నాన్న క్రమశిక్షణ నేర్పించారు. విద్యతో పాటు వినయాన్ని పెంపొందించుకోవాలని నాన్న చెబుతారు. వినయంతో ఉన్న విద్య వలనే ఉన్నత శిఖరాలకు వెళ్లగలం. అందుకే నాన్న మాటలే నాకు శిరోధార్యం.

- బమ్మిడి అవంతి
D/o రుక్మాంగధరావు, సోంపేట

సమాజంపై గౌరవం పెంచిన నాన్న

అమ్మ ఉద్యోగ బాధ్యతలలో బిజీగా ఉంటే నాన్న నా బాధ్యతలను ఎక్కువగా తీసుకున్నారు. నా భవిష్యత్‌కు ఏది మంచిదో నాన్నే నిర్ణయించి నన్ను ముందుకు నడిపిస్తారు. సమాజంపట్ల ఒక గౌరవాన్ని పెంపొందించి సామాజిక బాధ్యత అంటే ఏమిటో నాన్నే నాకు నేర్పించారు. ఆయన మాటే నా బాట.

- పామర్తి అనిమిష,
D/o పామర్తి రవి, మంగళగిరి, గుంటూరు జిల్లా

సహకరిస్తున్నాడు. తల్లి కన్నా పిల్లలు తండ్రికే ఎక్కువ చేరిక అవుతున్నారు. తల్లి దగ్గర భయాన్ని చూపించే ఆడ పిల్లలు కూడా తండ్రి దగ్గర స్వేచ్ఛగా తమ మనోభావాలను బయటపెట్టడంలో వెనుకంజ వేయడం లేదు. పిల్లలు తండ్రిని తమ మొదటి స్నేహితునిగా అభిమానిస్తున్నారు. పిల్లల సంరక్షణ విషయంలో ఎలాంటి గొప్పలకూ పోకుండా భార్యకు సహకరిస్తూ తన బాధ్యతలను నెరవేరుస్తున్నాడు. చదువుల్లో పిల్లల ప్రగతి, వైఫల్యాల గురించి ఆరా తీస్తూ వారి భవిష్యత్ కలలను సాకారం చేసేందుకు నాన్న ఎంతగానో ఆలోచిస్తున్నాడు. పరీక్షల సమయంలో అనుక్షణం పిల్లలను మానసికంగా సన్నద్ధం చేస్తూ, వారికి ధైర్యాన్ని నూరిపోయడంలో నాన్న చేస్తున్న కషి తక్కువేమీ కాదు.

వాత్సల్యానికి ప్రతిరూపం...

బిడ్డలకు తల్లి అవసరం ఎంత ఎక్కువ కావాలని చెబుతామో తండ్రి చేయూత కూడా అంతే స్థాయిలో అందాలన్నది నిజం. తల్లి బిడ్డలను పొత్తిళ్లలో పొదువుకుని స్థైర్యాన్ని.. ధైర్యాన్ని ప్రసాదిస్తుంది. అదే బిడ్డలకు తండ్రి తన చిటికెన వేలు అందించి నడకను.. మనోధైర్యాన్ని నింపుతాడు. ఒక వయసు వరకు బిడ్డలు తల్లిలో అంతర్భాగమై నడుచుకున్నప్పటికీ నాన్నతో జట్టు కట్టడం కూడా మొదలెడతారు. మానసిక శాస్త్రం ప్రకారం ఆడపిల్లలు తన తల్లినే పోటీగా భావిస్తూ తండ్రి నుండి ఎక్కువ స్థాయిలో ప్రేమాను రాగాలు పొందడానికి ప్రయత్నిస్తూ తండ్రికి మరింత చేరువ కావడాన్ని 'ఎలక్ట్రా కాంప్లెక్స్' అంటారు. మగ పిల్లలు తండ్రిని తమకు పోటీగా భావిస్తూ తల్లి నుండి ప్రేమాను రాగాలను అధిక స్థాయిలో కోరుకుంటారు. దీనిని 'ఎడిపస్ కాంప్లెక్స్' అంటారు. స్త్రీవాదుల ప్రకారం పిల్లలు తల్లి చెప్పిన దాని ప్రకారమే తండ్రిని గుర్తిస్తారని తెలుస్తుంది. కాని విజ్ఞాన శాస్త్రవేత్తల పరిశోధనలను బట్టి పుట్టిన పాపాయి కళ్లు తెరిచినప్పటి నుండి తల్లిలో అంతర్భాగంగా వుంటూనే తండ్రి కోసం వెతుకుతుందట. అందువల్లే తండ్రి ప్రాధాన్యత పాపాయి జీవితంలో తొలి రోజు నుంచే మొదలౌతుంది. ఆత్మీయతకు అమ్మ ప్రతిబింబమైతే.. అంతులేని వాత్సల్యానికి నాన్న ఓ ప్రతిరూపం. పిల్లల్లో ధైర్యాన్ని నింపి, వారు దర్జాగా బతికేందుకు అనుక్షణం ఆసరా ఇచ్చేది నాన్న.

మారుతున్న తరం...

ఒకప్పుడు పిల్లలంతా తండ్రి మాటను జవదాటని వారే! కానీ నేటికాలంలో తమకు నచ్చని విషయాలను నిర్మొహమాటంగా వ్యతిరేకించడానికి పిల్లలు ఏమాత్రం సందేహించడం లేదు. ఆధునిక విజ్ఞాన వికాసం వల్ల పిల్లల మనసులపై రకరకాల ప్రభావాలు పడుతున్నాయి. అందుకు అనుగుణంగా పిల్లల మనోభావాలను తెలుసుకుంటూ వారి ఇష్టాలను లెక్కలోకి తీసుకుని వారికి నచ్చిందే చేయాలని ప్రస్తుత సమాజంలో ఎక్కువ మంది తండ్రులు భావిస్తున్నారు. పిల్లల అభిరుచులు, అభిప్రాయాలను గౌరవించినప్పుడు మేలే జరుగుతుందన్న విషయాన్ని నాన్నలు గ్రహిస్తున్నారు. చదువు, పెళ్లి విషయాల్లో పిల్లల మనోభావాలకే తండ్రులు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఉదయాన్నే నిద్ర లేపి పిల్లల చేత పద్ధతి ప్రకారం చదివించడం, పరీక్షలు రాసేందుకు తగిన మనోధైర్యాన్నిస్తూ వారిని పరీక్షా కేంద్రాల వద్దకు తీసుకువెళ్లడం, మంచి మార్కులొస్తే అభినందించడం, తక్కువ మార్కులొస్తే ధైర్యం చెప్పడం, వారికి నచ్చిన కోర్సులు చదివించడం, వారికి నచ్చిన ఉద్యోగానికి వెళ్లేలా ప్రోత్సహించడం, యుక్త వయసుకొచ్చి ప్రేమలో పడితే నిండు మనసుతో అంగీకరించడం, నచ్చిన వారితో పెళ్లి జరిపించడం...ఈ బాధ్యతలన్నీ తండ్రులు నేడు మనస్ఫూర్తిగా నిర్వహిస్తున్నారు. పిల్లలకు నచ్చని పనులు చేయాలని తల్లిదండ్రులు భావించకపోవడం... కుటుంబ వ్యవస్థలో వచ్చిన మంచి పరిణామం. చాలా మంది తండ్రులు బూర్జువా మనస్తత్వాల నుంచి బయటపడి విశాల దృక్పథాన్ని అలవర్చుకుని కుటుంబాన్ని సమర్థవంతంగా నడిపిస్తున్నారు. ఇలాంటి మార్పులే కుటుంబంలో మమతానురాగాలు వెల్లివిరియడానికి దోహదం చేస్తున్నాయి.

మీసాల అమ్మలు...

గతంలో సంపాదించడం ఒక్కటే నాన్న ప్రధాన బాధ్యత అన్న భావం ఉండేది. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ నడిచే రోజుల్లో







తండ్రి అంటే అత్యంత భయభక్తులుండేవి. ఎదిరించి మాట్లాడటం కాదు కదా.. కావాల్సింది అడగడానికీ జంకేవారు. ఏది కావాలన్నా తల్లిని మాత్రమే అడిగేవారు. అయితే.. కాల చక్రంలో అనేక మార్పులు వచ్చాయి. ఉమ్మడి కుటుంబాలు చెదిరిపోయాయి. చిన్న కుటుంబాల్లో తండ్రి స్నేహితుడిగా మారిపోయాడు. పిల్లలకు మార్గదర్శిగా ఉంటూనే స్నేహితుడిలా నడిపిస్తున్నాడు. ఇప్పుడు నాన్న కొత్త బాధ్యత తీసుకోవాల్సి వస్తోంది. మహిళా చైతన్యం పెరిగి ఉద్యోగాల్లో పోటీపడటంతో కాలం మారి భార్యాభర్తలిరువురూ ఉద్యోగాలు చేయగలుగుతున్నారు. అందుకే ఇంటి పనుల్లో సగం బాధ్యతను తండ్రి తీసుకుంటున్నాడు. నిరుద్యోగ సమస్య తీవ్రమవడంతో ఉద్యోగం కోల్పోయిన భర్త ఇంటి పట్టునే ఉండి పిల్లల బాధ్యతలు చూసుకుంటూ భార్య వృత్తి జీవితానికి ప్రోత్సాహాన్నిస్తున్నాడు. ఒక విధంగా చెప్పాలంటే వీరిని 'హౌస్ హజ్బెండ్స్' అని పిలవడం పశ్చిమ దేశాల్లో ఎక్కువవుతోంది. తండ్రి సంపాదనాపరుడైతే తల్లి ఎలా ఇంటి బాధ్యతలు నిర్వర్తిస్తుందో అంతకంటే ఎక్కువగా ఈ హౌస్ హస్బెండ్స్ తమ పిల్లల పెంపకంలో తలమునకలై ఉంటున్నారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా ఉన్న తల్లిదండ్రుల్లో చాలామంది ఈ విధమైన పనిని కూడా సర్దుబాటు చేసుకుంటున్నారు. తండ్రి నైట్‌షిఫ్టుల్లో ఉద్యోగం చేసి పగటి సమయంలో పిల్లల బాధ్యతలను తీసుకుంటున్నాడు. తల్లి పగటి సమయంలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తుండడంతో పిల్లల పెంపకం, వారికి కావాల్సినవి అందించడం, వారిని స్కూళ్లకు పంపించడం, లంచ్ సిద్ధం చేయడం వంటి బాధ్యతలను తండ్రి తీసుకొంటున్నాడు. ఇంకా చిన్న పిల్లలను ఇంటి దగ్గరే సాకడంలో నాన్న తల్లి పాత్రను పోషిస్తున్నాడు. వారికి నేపీలు మార్చడం నుంచి జోలపాటలతో నిద్రపుచ్చడం వరకూ అన్ని పనులూ నాన్న చేస్తున్నాడు. ఇందు కోసం విదేశాలలో అయితే ఉద్యోగాలు చేసే నాన్నలకు ఆయా యాజమాన్యాలు పెయిడ్ లీవ్స్ కూడా మంజూరు చేస్తున్నాయి. అంటే ఇక్కడ నాన్న అంటే అచ్చంగా 'మీసాల అమ్మ'.

నాన్నే స్ఫూర్తి సంతకం

జీవితంలో ప్రతి ఒక్కరూ ఉన్నత స్థాయిలోని వ్యక్తులను తమకు ఆదర్శంగా ఎంపిక చేసుకుని అనుసరించడం సహజం. అలాంటి ఆదర్శ వ్యక్తిగా నాన్నే కనిపించగలిగితే ఆ పిల్లలకు అంతకంటే అదృష్టం మరొకటి ఉండదు. కుటుంబాన్ని 'లీడ్' చేయడంలో నాన్నను పిల్లలు ఎప్పటికప్పుడు గమనిస్తూనే ఉంటారు. ఎన్ని సవాళ్లు ఎదురైనా? ఎన్ని సమస్యలు ఉత్పన్నమైనా? ఎన్ని అవరోధాలు నిరోధించినా? ఆయా సందర్భాల్లో కుటుంబ నౌకను ముందుకు నడిపించే కెప్టెన్‌గా నాన్న వారి పిల్లలకు స్ఫూర్తిగా నిలుస్తాడు. అమ్మ పట్ల నాన్న ప్రవర్తించే తీరు కూతుళ్లను ఎక్కువగా ప్రభావితం చేస్తుంది. తమకు రాబోయే భర్తల నుండి ఎలాంటి ప్రేమాభిమానాలను పొందాలో వారు దానిని బట్టే నిర్ణయించుకోగలుగుతారు. ప్రతి నాన్న ప్రతి అమ్మాయికి తొలి హీరో. తాను వేసే ప్రతి అడుగులో నాన్న ఇచ్చే ధైర్యం ఆమెను ధీర వనితగా మార్చేస్తుంది. ఎటువంటి పరిస్థితులనైనా నాన్న వెనుక వున్నాడనే ధైర్యంతో ఆమె ఎదుర్కొంటుంది. అందువల్లే 'ఐ లవ్ యూ డాడీ...' అనే అమ్మాయిల సంఖ్య నేటి తరంలో ఎక్కువే. 'మై డాడీ ఈజ్ మై బెస్ట్‌ఫ్రెండ్' అని అమ్మాయిలు ఎక్కువగా చెప్పుకోవడానికి ఏమాత్రం సందేహించడం లేదు. తన కూతురు జీవితాంతం ఆనందంగా సంతోషంగా ఉల్లాసంగా వుండాలని కోరుకునే తండ్రి కూతురి దృష్టిలో బెస్ట్ ఫ్రెండే వారు. తండ్రినే ఎక్కువ ప్రేమిస్తారు. ఆరాధిస్తారు.

నాన్నంటే చాలా ఇష్టం

నాన్నంటే చాలా ఇష్టం. అమ్మ అన్నీ చూసుకుంటుంది. కానీ నాన్న ఎంతో ప్రేమతో స్కూలుకు తీసుకువెళ్తారు. దగ్గరుండి హోమ్‌వర్క్ చేయిస్తారు. ఎంత అల్లరి చేసినా ఏమాత్రం కోపం పడకుండా దగ్గరికి తీసుకుంటారు. ఎంత పనివత్తిడితో బయటనుంచి నాన్న వచ్చినా నేను పలకరిస్తే చాలు వాటన్నింటినీ నాన్న మర్చిపోతారు.

– బరాటం హారిణి
D/o రవి, శ్రీకాకుళం

నాన్నే నాకు ప్రేరణ

మా నాన్నే నాకు ప్రేరణ. నిరంతరం సమాజంకోసం ఏదో ఒకటి చేయాలని ఆయన తపన. ప్రజాఉద్యమాల్లో పాల్గొ వడమే కాకుండా ప్రజా గీతాలను ఆలాపిస్తూ జనచైతన్యం కోసం కృషి చేస్తుంటారు. ఆయన నుంచి నేను నేర్చుకోవాల్సింది చాలా ఉంది.

– కంచర్ల క్రాంతి,
s/o కంచర్ల కాశయ్య, కుంచనపల్లి,

నాన్న వంట అదుర్స్

ప్రస్తుతం పట్టణాల్లోని చాలా ఇళ్లలో ఉదయం పూట కన్పించే దృశ్యాలను చూస్తే నాన్న పిల్లల కోసం వంట బాధ్యతలను కూడా భుజాన వేసుకున్నట్లు కన్పిస్తోంది. భార్య ఉదయాన్నే ఉద్యోగానికి వెళ్లిపోతే ఒక పక్క వంట చేస్తూ, మరో పక్క పిల్లలని స్కూళ్లకు సిద్ధం చేస్తూ ఉన్న నాన్నలే ఎక్కువ మంది కన్పిస్తారు. "డాడీ! మా స్కూల్ బస్ వచ్చేస్తోంది.." అని పిల్లలు అరుస్తుంటే..."ఇదిగో లంచ్ బాక్స్ రెడీ" అంటూ ఆదరాబాదరాగా కిచెన్ నుంచి బయటకు వస్తూ వారికి దానిని అందించే నాన్న.. బస్సులో వాళ్లు వెళ్లిపోతుంటే టాటా చెప్పే దృశ్యాలు ఎన్నో మనకు కన్పిస్తుంటాయి. నవతరం తండ్రులు అమ్మలుగా మారిపోతున్నారు. పిల్లలు కోరినది కిచెన్‌లో తయారు చేసి ఇవ్వడానికి నేటి నాన్నలు ఉత్సాహాన్ని చూపిస్తున్నారు. అంతకు ముందు వంట రాకపోయినా తండ్రులు కూడా వివిధ పత్రికలు చదివి, టీవీ చానళ్లు చూసి కొత్త కొత్త రకాల వంటలు ట్రై చేస్తూ నలభీముల్లా మారిపోతున్నారు. తమ పిల్లల చేత "నాన్న వంట అదుర్స్" అని మెప్పు పొందుతూ సంబరపడుతున్నారు.

జడలు వేస్తున్న నాన్నలు

ఎక్కడైనా అమ్మే అమ్మాయిలకు జడలు వేస్తుందని అనుకుంటుంటాం. కానీ నేటి నాన్నలు మాత్రం తమ కూతుళ్లకి తామే జడలు వేస్తున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. వారిని స్కూళ్లకు

నాన్న కోసం

"ఓ నాన్నా... నీ మనసే వెన్నా... అమృతం కన్నా అది ఎంతో మిన్నా....!" అని ఒక సినీ కవి అన్నా, "ఔదార్యాన్ని గాంభీర్యాన్ని అనురాగాన్ని త్యాగాన్ని రంగరిస్తే తయారయ్యే ఆత్మీయ రూపం నాన్న" అని మరో కవి వర్ణించినా,

"బ్రతుకు నావ వ్యసనాల గాలికి కొట్టుకు పోకుండా క్రమ శిక్షణల తెర చాపలను పైకెత్తి గమ్యం వైపు నడిపించే దీప స్థంభం నాన్న " అని సాహిత్యంలో కవితాత్మకంగా వివరించినా అంతా 'నాన్న' గొప్పతనం గురించే. నాన్న జ్ఞాపకాలలో కలాన్ని ముంచి ఎందరో ప్రముఖులు కథలు, కవిత్వం, వ్యాసాలు ఇలా ఎన్నో సాహితీ ప్రక్రియల్లో నాన్నను ఆవిష్కరించారు. అంతేకాదు. పాతతరం నుంచి వర్తమానం వరకూ ఎన్నో సినిమాలు కుటుంబంలో, సమాజంలో నాన్నకు గల ప్రాముఖ్యతను వివరిస్తూ వచ్చినవే. "నాన్న, ఆకాశమంత, నాన్నకు ప్రేమతో, సన్నాఫ్ సత్యమూర్తి, సీతమ్మ వాకిట్లో సిరి మల్లె చెట్టు, దూకుడు, రాజాబాబు......" ఇలా ఎన్నో సినిమాలు నాన్నతో ఉన్న అనుబంధాన్నీ, ఆత్మీయతనూ వివరిస్తూ వచ్చాయి. ఇంకా వస్తున్నాయి. 'నాన్న' అనే మాట జీవితానికి పెన్నిధి.

ఒక కూతురి సంకల్పమే...

తండ్రి పాత్రకు తగిన గుర్తింపు కోసం ఒక కూతురు పడిన తపన నుంచి పుట్టిందే ఈ ఫాదర్స్ డే (పితృ దినోత్సవం). ఆ దిశగా ప్రయత్నాలు చేసింది వాషింగ్టన్‌కు చెందిన సొనారా. వాషింగ్టన్‌లోని స్పోక్యాన్ అనే గ్రామంలో నివాసముండే హెన్నీ జాక్సన్ స్మార్ట్, విలియమ్ స్మార్ట్ అనే దంపతులకు ఆరో సంతానం సొనారా. సొనారాకి 6 నెలల వయసున్నప్పుడే తల్లి మరణించింది. అప్పట్లోను (1895లో) విలియమ్‌కు మరో పెళ్లి చేసుకునే హక్కు, అవకాశం వారి సమాజంలో ఉన్నాయి. కానీ తండ్రిగా తన పాత్రకు న్యాయం చేయడానికే ఆయన మక్కువ చూపారు. వ్యవసాయం చేస్తూ తన బిడ్డలకు తల్లి లేని లోటు తెలియకుండా పెంచారు. ఆరు నెలల పసిపాపకు పాలు పట్టడం, స్నానం చేయించడం, జోలపాడి నిద్రపుచ్చడం.. ఇలా అన్నీ విలియం చేశారు. తల్లి ఉంటుందని కూడా ఆ చిన్న వయసులో సొనారాకి తెలియదు. ఇలా పెరిగిన సొనారాకి 27 ఏళ్ల వయసులో ఒక ఆలోచన వచ్చింది. తన తండ్రి పుట్టిన రోజునే తండ్రులందరి జన్మదినంగా జరపాలని ఆమె భావించింది. అయితే తన తండ్రి జన్మించింది జూన్‌లో అని తెలుసుగానీ, ఏ రోజునో సొనారాకి తెలియదు. దీంతో తన తండ్రి జన్మించిన జూన్‌లో ఏదో ఒక రోజు ఈ వేడుకలను జరపాలని భావించింది. అనుకున్నట్టు ఆ నెలలో ఒక రోజు ఆ ఊరిలో వారందరినీ ఆహ్వానించింది. తండ్రులు పోషించే పాత్రను మొత్తం సమాజానికి, ఇతర పిల్లలకు తెలియజెప్పే రోజని అందుకే ఈ రోజును ఫాదర్స్‌డేగా జరుపుదామని సొనారా ప్రకటించింది. ఆ ఆలోచన గ్రామస్తులకు కూడా నచ్చడంతో అప్పటి నుంచి వారు ఆ గ్రామంలో ఈ వేడుకలు జరుపుకోవడం ప్రారంభించారు. 1910 జూన్ 19న ప్రపంచంలోనే తొలిసారిగా అధికారికంగా అమెరికాలో ఫాదర్స్‌డే వేడుకలు నిర్వహించారు. తర్వాత అది ప్రపంచ వ్యాప్తమైంది.

పంపించే సమయంలో భార్య అందుబాటులో లేకపోతే నాన్నే ఆడపిల్లలకు జడలు వేసి, సాక్సులు తొడిగి, షూస్ బిగించి స్కూల్ బస్సెక్కిస్తున్నాడు. ఈ పనులను నాన్నలు సమర్థవంతంగా చేయడానికి వారికి విదేశాలలో శిక్షణ ఇచ్చే సంస్థలు కూడా ఉన్నాయి. ఆడ పనీ, మగ పనీ అంటూ వేర్వేరుగా ఉండవనీ అన్ని పనులూ అందరూ చేయవచ్చనే విశాల దృక్పథాన్ని చిన్న వయసు నుంచే నేటి నాన్నలు తమ పిల్లల్లో కలిగిస్తున్నారు. అంతే కాకుండా పిల్లలకు అవసరమైనవన్నీ చేసి పెట్టడం తమ బాధ్యత కన్నా ఎక్కువగా నాన్నలు భావిస్తున్నారు. అందువల్ల అమ్మ ఊరెళ్లినా, ఉద్యోగానికి వెళ్లినా నాన్న తమ చెంతన ఉంటే ఎంతో ధీమాగా పిల్లలు ఫీలౌతున్నారు. ఇది తండ్రితో వారి అనుబంధాన్ని మరింత పటిష్టం చేస్తోంది.

పిల్లలతో విహారానికి

కేవలం ఇంటి దగ్గరే పిల్లలను సాకుతూ వారి ఆలనా పాలనా చూడడానికి పరిమితం కావడం లేదు నేటి నాన్నలు. అవకాశం, ఆర్థిక వెసులుబాటు ఉన్నప్పుడల్లా పిల్లలతో విహార యాత్రలకు వెళ్లడానికి ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తున్నారు. ఇటీవల ఈశాన్య చైనాలోని తంగసాన్ అనే పట్టణంలో నివసించే క్యిహైలియంగ్ అనే వ్యాపారవేత్త తన ఊపిరి సలపని వ్యాపారాల్లో తలమునకలైపోతూనే..

కూతురు పట్ల ఎంతో ప్రేమతో ఎవరూ ఊహించని గొప్ప విహార యాత్ర చేశాడు. అతని కుమార్తె పేరు లియు. ఆ అమ్మాయి వయసు నాలుగేళ్లే, కానీ ఆమెకు తమ దేశాన్ని చూపించాలనే సంకల్పంతో ఒక సైకిల్‌పైనే విహారయాత్రకు అతను శ్రీకారం చుట్టాడు. చైనాలో ఏకంగా ఎనిమిది వేల కిలోమీటర్ల దూరం వరకూ సైకిల్ మీదనే ఆ తండ్రీ కూతుళ్లు విహార యాత్ర చేసేశారు. కేవలం రోడ్డు మీదనే వారి విహార యాత్ర సాగలేదు. తాము వెళ్లే దారిలో కన్పించిన పర్వతాలను కూడా అధిరోహించి రికార్డు సృష్టించారు. ఈ స్థాయిలో కాకపోయినా నేటి తండ్రులు తమ పిల్లలను విహారయాత్రలకు తీసుకెళ్లి కొత్త కొత్త ప్రాంతాలను, అక్కడి మనుషుల అలవాట్లను, వింతలు, విశేషాలు పరిచయం చేయడానికి ఎంతో ఆసక్తి చూపిస్తున్నారు. అందుకోసం ప్రతీ యేటా తమ ఆదాయంలో కొంతమొత్తాన్ని కూడా పక్కన పెట్టి పిల్లల సంతృప్తే తమ లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు.

ఆటపాటలు నేర్పుతూ

నేటి నాన్నలు తమ చిన్నప్పుడు తగిన అవకాశాలు లేక తాము కోల్పోయినవన్నీ తమ పిల్లలు కోల్పోకూడదనే పట్టుదలతో ఉన్నారు. తమ పిల్లలను చిన్నవయసు నుంచే ఆటపాటల్లో ప్రవేశం కల్పిస్తున్నారు. తప్పటడుగుల వయసులోనే సైకిల్ నేర్పించడం, నడక వస్తున్న తరుణంలోనే ఫుట్‌బాల్ నేర్పిస్తుండడం, డ్యాన్సులు నేర్పిస్తుండడం, కరాటే, కుంగ్‌ఫూ, తైక్వాండో వంటివాటిలో శిక్షణ ఇప్పిస్తుండడం .....ఇలా ఒకటేమిటి? ఎక్కడ ఏ చిన్న అంశం తమ పిల్లలకు ఉపకరిస్తుందని అన్పించినా దానిని వెంటనే తమ పిల్లలకు నేర్పించడానికి ఏమాత్రం వెనుకంజవేయడం లేదు. తమ కన్నా తమ పిల్లలు మరింత ఉన్నతంగా ఎదగాలన్న తపన నేటి నాన్నల్లో చాలా ఎక్కువగా కన్పిస్తోంది.

రేపటి నాన్నలు

నేటి మగపిల్లలంతా రేపటి తండ్రులే. చిన్నవయసులోనే చదువును, సంస్కారాన్ని నేర్పే నాన్న నుంచే పిల్లలు కొత్త ఆదర్శాలను అంది పుచ్చుకుంటారు. సమాజ గమనంలో తమ ఉనికిని పదిలపరచుకుంటూనే నాన్న నేర్పిన ఆదర్శాల వెలుగుల్లో ముందుకు సాగుతారు. తాము యుక్త వయసుకు వచ్చిన తర్వాత వివాహాలు చేసుకుని తండ్రి బాధ్యతలలోకి మారిన సందర్భంలో అంతకు ముందు తమ నాన్న తమకు నేర్పిన సంస్కారాన్ని గుర్తు చేసుకుంటారు. తమ పిల్లలకు అప్పటి సమాజ పరిస్థితులకు అనుగుణంగా నైతిక సంస్కారాన్ని అందిస్తుంటారు. ఇదంతా ఒక జీవన చక్రం.

అంతా అబద్ధం

ఒక్క అబద్ధం కూడా ఆడని వాళ్లు ఎవరైనా ఉన్నారంటే అది ఆశ్చర్యానికి గురిచేసే విషయమే. అవసరాన్ని బట్టీ అందరూ రోజు మొత్తంలో ఏదో ఒక అబద్ధం అడేస్తుంటారు. బోస్టన్‌లోని ఒక స్టార్టప్ కంపెనీలో డిజైన్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్న ఫ్రాంకెల్ కూడా ఆరు నెలల క్రితం వరకు అందరిలానే అబద్ధాలాడేవాడు. వృత్తి రీత్యా తెగ అబద్ధాలాడాల్సొచ్చేదట ఫ్రాంకెల్‌కి. తరచూ ఇలా మాటల గారడితో తన కస్టమర్లని బోల్తా కొట్టించడంలో మనోడు ఆరితేరాడు. ఫ్రాంకెల్‌ని మిత్రులతోపాటు కుటుంబ సభ్యులు మిస్టర్ లయర్‌గా పిలిచేవారు. నిజాలు చెప్పడనే అప నమ్మకం వారిలో బలపడడంతో అతను ప్రతి విషయానికి సంజాయిషీ ఇచ్చుకోవాల్సొచ్చేది. పరిస్థితి మరింత చేజారుతుండటంతో ఇక అబద్ధాలు ఆడకూడదని నిర్ణయించుకున్నాడు ఫ్రాంకెల్. అబద్ధమాడటం ఒక కళ అయితే అబద్ధాలాడకుండా ఉండడం అంతకంటే కష్టమైన పని. ఈ విషయాన్ని అంతా అబద్ధం అంటూ ఆట పట్టిస్తున్నారు మిత్రులు.

వింత లోకం

సమాధి తవ్వే పోటీ

హంగేరీ దేశంలోని డెబ్రిన్స్ ప్రాంతంలో సమాధులు తవ్వే పోటీని నిర్వహించారు. 200 సెం.మీ. పొడవు, 80 సెం.మీ. వెడల్పు, 160 సెం.మీ. లోతు ఉండేలా తమకి కేటాయించిన స్థలంలో అందంగా సమాధిని తవ్వాల్సి ఉంటుంది. అందరి కంటే తక్కువ సమయంలో నిబంధనలకు లోబడి సమాధిని పూర్తి చేసిన వారే ఇక్కడ విజేతలు. ప్రతి టీంలో ఇద్దరు సభ్యులు మాత్రమే ఉంటారు. ఎవరు ఏం చేయాలన్నది వారే నిర్ణయించుకోవాలి. వేర్వేరు ప్రదేశాల నుంచీ వచ్చి పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. సమాధులు తవ్వేందుకు యంత్రాలొచ్చేసినా కూడా దాన్ని అంత్యక్రియలంటే గౌరవంగా ఉండాలని మనుషులే తవ్వడానికి పెద్దలు ఇష్టపడతారు. దీనిపై యువతలో అవగాహన పెంచి ఇది గౌరవప్రదమైన వృత్తిగా పరిచయం చేసేందుకు ఇలాంటి పోటీలను నిర్వహిస్తున్నారు.





గొడ్డలితో ఆట

కెనడాలోని నోవా స్కాటియాలో 'టింబర్ లాగ్' బార్‌లో అందరూ గొడ్డళ్లతో కనిపిస్తారు. బార్‌లో గొడ్డళ్లు పట్టుకు తిరిగే వారిని చూస్తే తప్పతాగి కొట్టుకోడానికి గొడ్డళ్లతో రెడీ అయిపోయారనిపిస్తుంది. వారు గొడ్డళ్లు పట్టుకునేది.. డార్ట్స్, బౌలింగ్ గేమ్‌లా అక్కడ 'యాక్స్ త్రో'(గొడ్డలి విసరడం) ఆట ఆడేందుకు. డారెన్ హుడ్సన్ షెల్‌బర్న్‌లో ఒక సామిల్లుని నడిపేవాడు. అప్పుడే గొడ్డలి విసరడంలో ఆరి తేరాడు హుడ్సన్. దీన్నో ఆటలా ఎక్కువ మందికి పరిచయం చేయాలనుకున్నాడు. తనలానే గురి తప్పకుండా గొడ్డలిని విసిరే కొందరు ఔత్సాహికులతో కలిసి 'యాక్సి థ్రోయింగ్ లాంజ్'ని ఏర్పాటు చేశాడు. ఆటలో పాల్గొనాలంటే మాత్రం మోతాదుకు మించి తాగ కూడదనే నియమాన్ని కచ్చితంగా పాటించాల్సి ఉంది.

భారత తొలి మహిళా గోల్ఫర్

మనదేశం నుంచి గోల్ఫ్‌లో మగవాళ్ల కన్నా మహిళా క్రీడాకారుణులే బాగా రాణిస్తున్నారు. వీరిలో ముందుగా చెప్పుకోవాల్సిన పేరు స్మృతి మెహ్రా. ఖరీదైన ఈ క్రీడలో ప్రతికూల పరిస్థితులను తట్టుకుని అంతర్జాతీయ వేదికలపై రాణించిన తొలి భారత మహిళా గోల్ఫర్ స్మృతి మెహ్రా. మహిళల గోల్ఫ్ టూర్లలో ప్రపంచంలోనే ప్రముఖమైనదిగా పేర్కొనే ఎల్‌పిజిఎ టూర్ (అమెరికా)లో సభ్యత్వం సాధించిన తొలి భారత మహిళగా ఆమె ఘనత దక్కించుకుంది.

విదేశాల్లో జరిగే టూర్ టైటిల్స్‌లో పాల్గొనడానికి భారీ వ్యయం అవసరమవుతుంది. అసలు అత్యంత ధనిక క్రీడగా పేరుగాంచిన గోల్ఫ్‌లో ప్రవేశించడమే అంత సులువైన విషయం కాదు. శిక్షణకే భారీ మొత్తం అవసరమవుతుంది. స్పాన్సర్లు దొరకడం కష్టమైన విషయం. వీటన్నింటినీ గోల్ పోస్ట్‌లోకి నెట్టేసి గోల్ఫ్‌లో అమెచ్యూర్, ప్రొఫెషనల్ విభాగాల్లో రాణించింది స్మృతి మెహ్రా. ఆమె కోల్‌కతాలో 1972 మే 12న జన్మించింది. సిమీ అని ముద్దుగా పిలుచుకునేవారు తల్లిదండ్రులు. ఆమె పాఠశాలకు వెళ్తున్న రోజుల్లో గోల్ఫ్ కోర్సుల్లో నిదానంగా, ప్రశాంతంగా ఆడుతున్న క్రీడాకారులను పరిశీలనగా చూస్తుండేది. ముఖ్యంగా స్మృతిని ఆకట్టుకున్నది కొన్ని సెం.మీ.ల ఎత్తుకు చక్కగా క్రాప్ చేసిన గడ్డి మైదానాలు. ఎత్తు పల్లాలతో ఉండే ఆ పచ్చటి మైదానంలో బుల్లి మొబైల్ కార్లలో తిరుగుతూ గోల్ఫ్ ఆటను ఆడతుండటం ప్రత్యేకంగా అనిపించేది. ఆ ఆకర్షణే ఆమెతో 12 ఏళ్లప్పటికే గోల్ఫ్ క్లబ్‌ను పట్టుకునేలా చేసింది. కొన్ని నెలల్లోనే క్లబ్‌ల్లో ఏ స్టాఫ్‌ను ఎంత దూరాలకు వినియోగించాలో నేర్చేసుకుంది. టెక్నికల్‌గా ఆమె మిగతా వారికంటే ఓ అడుగు ముందుండటానికి కారణమిదే. ఓ వైపు గోల్ఫ్‌కు అంకితమవుతూనే చదువును కూడా కొనసాగించింది. కోల్‌కతా విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యను పూర్తి చేసుకుంది. 1994లో ప్రొఫెషనల్ గోల్ఫ్‌లో ప్రవేశించిన స్మృతి అంతకు ముందే అమెచ్యూర్ విభాగంలో పలు టైటిళ్ళు సాధించింది. ఈ రెండు విభాగాల్లోనూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించింది. అమెచ్యూర్ విభాగంలో 1993 మలేషియా జాతీయ చాంపియన్‌షిప్‌ను స్మృతి గెలుచుకుంది. 1994లో ఇండియా నేషనల్ మ్యాచ్ ప్లే చాంపియన్‌షిప్‌ను, ఇండియా నేషనల్ స్ట్రోక్ ప్లే చాంపియన్‌షిప్‌ల్లో విజేతగా నిలిచింది. ఎల్‌పిజిఎ టూర్‌లో 1997 నుంచి 1999 వరకూ భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన స్మృతి 1996లో ఫ్యూచర్స్ టూర్‌లో విజేతగా నిలిచింది. 1996లో గ్రీన్ మౌంటైన్ నేషనల్ ఫ్యూచర్స్ గోల్ఫ్ క్లాసిక్, 2004లో ఫ్రే క్లాసిక్, హంటర్స్ ఓక్ ఫ్యూచర్స్ గోల్ఫ్ క్లాసిక్‌లోనూ టైటిళ్ళు సాధించింది. 2005 స్మృతి భుజానికి శస్త్ర చికిత్స జరిగింది. ఈ తరువాత కూడా ఆమె కొన్ని టోర్నీల్లో మెరుగైన ప్రదర్శన కనబర్చింది. 2011-12 సీజన్‌లో హీరో 'ప్లేయర్ ఆఫ్ ది ఇయర్' అవార్డును స్మృతి గెలుచుకుంది. ఈ ఏడాదిలో ప్రొఫెషనల్ గోల్ఫ్ టూర్‌లో భారత మహిళల జట్టులో స్మృతి సభ్యురాలిగా ఉంది. ఆమె ప్రతిభతో భారత్ 15 విభాగాల్లో 7 పతకాలను గెలుచుకుంది. వయస్సు పెరుగుతుండటం టైటిళ్ల సాధించడంలో స్మృతిపై ఎలాంటి ప్రభావం చూపడం లేదు. 2015లో పుణే ఆతిథ్యం ఇచ్చిన 6 లక్షల రూపాయల నగదు బహుమతిగా ఉన్న మహిళల ప్రో గోల్ఫ్ చాంపియన్‌షిప్‌ను ఆమె గెలుచుకోవడమే ఇందుకు నిదర్శనం. గత ఏడాదిలో మొత్తంగా 9,57,500 రూపాయలు గెలుచుకుని భారత మహిళా గోల్ఫర్లలో నాలుగో స్థానంలో నిలిచింది. 2016 హీరో ఉమెన్స్ ప్రొఫెషనల్ గోల్ఫ్ టూర్‌లో 5వ స్థానంలో నిలిచింది.

భారత్‌లో నంబర్‌వన్ మహిళా గోల్ఫర్‌గా ఎదిగిన స్మృతి గోల్ఫ్‌లో యువతకు శిక్షణ ఇవ్వడంలోనూ ముందుంటుంది. 2006లో బాల, బాలికలకు శిక్షణ ఇవ్వడానికి ప్రత్యేక కార్యక్రమం నిర్వహించింది. ఆమె కృషితోనే 2007లో మహిళల ప్రొఫెషనల్ టోర్నమెంట్ పిజిఎ ఆఫ్ ఇండియాను కోల్‌కతాలో నిర్వహించారు. మనదేశంలో మహిళ ప్రొఫెషనల్ గోల్ఫ్‌లో స్కిన్స్ గేమ్‌ను తొలిసారిగా పరిచయం చేసిన ఘనత కూడా స్మృతి మెహ్రాదే. తన ఆటతోనూ, గోల్ఫ్‌పై అంకిత భావంతోనూ తనను నిరూపించుకున్న ఆమె వర్ధమాన క్రీడాకారులకు మార్గదర్శిగా నిలుస్తోంది.

భారత మహిళ గోల్ఫ్ సమాఖ్య (డబ్ల్యూజిఏఐ) అధ్యక్షురాలుగా పనిచేసిన కవితా సింగ్ ఒక సందర్భంలో మాట్లాడుతూ 'డబ్ల్యూజిఏఐకు స్మృతి మెహ్రా గొప్ప బ్రాండ్ అంబాసిడర్. ఆమె గోల్ఫ్ కోర్స్‌లో మాత్రమే గొప్పగా ఉండరు. ఆమె ప్రయత్నం, సూచనలు, ఆలోచనలతోనే గత కొన్ని ఏళ్లగా భారత్‌లో మహిళల ప్రో టూర్ విజయవంతం అవుతుంది. స్మృతి ఒక నిజమైన విజేత. భారత మహిళ ప్రొఫెషనల్ గోల్ఫ్‌లో నూతన తరానికి ఆమె స్ఫూర్తి' అని వ్యాఖ్యానించడం స్మృతి గొప్పతనానికి నిదర్శనం.

- విశ్వ ప్రసాద్



ఇవేం 'తిండి' గొ

ఆవకాయ్ అనగానే ఆంధ్ర, సాంబార్ అనగానే తమిళనాడు అని
వంటకాలకు బోర్డర్లుండవు. అసలవి ఎక్కడ చేయితిరిగాయో తెలీ
ఫేవరెట్లయిపోయాయి. కానీ ఈ మధ్య ఈ వంటకాల్ని సొంతం
గదుల్ని దాటేసి పరిశోధక కమిటీల వరకు వెళ్తోందీ తిండి రాద్ధా
పాత్రలు ఎగరేసుకుంటున్న కొన్ని రాష్ట్రాలు దేశాలు గురించి కొన్ని

తందూరీ తిప్పలు

మసాలా దట్టించి కాల్చుకు తినడం మనకు మూడు వేల ఏళ్ల కిందటే తెలిసిన విద్యేనట. అందుకే తందూరీ వెరైటీలకు మూలం భారత్ అని కొందరు సాక్ష్యాలు చూపిస్తున్నారు. కానీ ఇప్పుడు చూస్తున్న వెరైటీలు మాత్రం ఇరాన్ పర్షియా (ఇరాన్) వంటోళ్లు ఆఫ్ఘనిస్తాన్ మీదుగా ఇక్కడకు వచ్చి వడ్డించినవని ఎక్కువ మంది వాదన.

దుంప, బాస్మతి కూడా

వంటకాల కన్నా కూడా కాయలు, బియ్యం రకాల మీద జీఐ (జాగ్రఫికల్ ఇండికేషన్) గొడవలు యుద్ధాన్నే తలపిస్తున్నాయి. ఎవరి సొంతం చేసుకుంటే వారికి అదనపు వెసులుబాట్లు కలిసొస్తాయని జీఐ మార్క్ కోసం అంతర్జాతీయ కోర్టులకు కూడా ఎక్కేందుకు వెనుకాడటం లేదు. బంగాళ దుంపల తొలుత వాడింది మేమంటే మేమని చిలీ, పెరూ దేశాలు గరిటె పట్టుకున్నాయి. చిలీ దక్షిణ కోస్తా ప్రాంతంలో క్రీ.శ.1500 నాటికే వీటిని పండించారని ఆధారాలున్నాయి. కానీ, టిటికాకా సరస్సు దగ్గరలోని యాండెస్ ప్రాంతం నుంచి స్పానియార్డ్‌లు వీటిని రుచి చూసి యూరప్ దేశాలకు పరిచయం చేశారని పెరూవియన్ల వాదన. ఆ దేశ మంత్రులైతే పొటాటో బ్యానర్లట్టుకుని రాజకీయాలే చేసేశారు. కానీ శాస్త్రీయ పరిశోధనల్లో చిలీ నుంచే అవి గిన్నెలు మారాయని తేలింది. ఇలానే బాస్మతిని కూడా అమెరికా వాళ్లు సొంతం చేసుకునేందుకు ప్రయత్నించారు. కానీ మధ్యప్రదేశ్‌లో కానీ, హిమాలయాల పాద భూమిలో కానీ ఈ వంగడం అభివృద్ధి చెందిందని భారతీయ పరిశోధకులు తేల్చారు. ఇండియాకే పట్టం కడదామనుకునేలోపు తమదంటే తమదని పాకిస్తానోళ్లు ఎసరు పెట్టేశారు.

రస మల్లగుల్లాలు

తీపి పాకంలో తెల్లటి ఉండలున్న రసగుల్లా సీసా చూడగానే నాలుక జానెడు సాగిపోయి రసాలూరే ఓ గోళీని చప్పున చప్పరించేయాలని చూస్తుంది. అంత రసవంతమైన రసగుల్లాకు కూడా ఈ కలినరీ డిప్లొమసీ మల్లగుల్లాలు తప్పడం లేదు. పండుగలనేముంది ఏ చిన్న కార్యక్రమమప్పుడైనా బెంగాలీ బాబుల వంట గదుల్లో రసగుల్లా సువాసనలు గుప్పుమనాల్సిందే. బెంగాలీలకు ఈ తీపి వంటకానికి హిస్టరీ ఈనాటిది కాదు. కానీ అంతకు ముందు నుంచే అది మాదీ అంటూ ఒడిశా వాసులు గోల చేస్తున్నారు. వారి పూరీ జగన్నాథునికి కూడా రసగుల్లానే ప్రసాదమని, 12వ శతాబ్దం నుంచే దాంతో నోరు తీపి చేసుకుంటున్నామని అంటున్నారు. ఈ విషయాన్ని నిగ్గు తేల్చేందుకు మూడు ప్యానెళ్లను కూడా ఒడిశా నియమించింది.

ఫ్రెంచ్ ఫ్రైస్ వార్స్

బంగాళ దుంపల్ని స్పెయిన్ వాళ్లు తీసుకెళ్లారని చెప్పాం కదా వాళ్లతో పాటు ఇటాలియన్లు కూడా రుచి చూసి కాసింత చేదు తగిలేసరికి వదిలేశారు. కానీ బెల్జియం వాసులు మాత్రం దుంపల్ని దులిపేశారు. దిన్నట్, లీగేల మధ్య నుండే మ్యూసె లోయ ప్రాంతంలో నదులన్ని చలికి గడ్డ కట్టుకుపోయేవి. అందుకే చిన్న చేపల్ని సన్నగా వేయించుకుని నిల్వ ఉంచుకునేవాళ్లు. బంగాళ దుంపల్ని కూడా ఇలా సన్నగా తరిగి కాసింత పెప్పర్ చల్లి పబ్బం గడుపుకునేవాళ్లట. అందుకే వేయించిన బంగాళ దుంప రేకల్ని ఫ్రెంచ్ ఫ్రైస్ అని నోట్లో వేసుకోకండని బెల్జియన్‌లు కోరుతున్నారు. కానీ, ఏం చేస్తాం అదే బాగా ఫిక్సయి ప్రపంచంలోని అన్ని మెనూ కార్డులోను అచ్చయిపోయింది.

యీ సాంగ్, యుషెంగ్ రెండూ ఒకటే రుచి

సింగపూర్, మలేషియాలు నీటి కోసం, భూమి కోసం గొడవలకు దిగాయనేది ఎరిగిన విషయమే అయినా ఓ వంటకం కోసం కూడా సెగ రాజేసుకుంటున్నాయి. పలుచగా కోసిన చేప ముక్కలు, కూరగాయల్ని కలిసి వండి వార్చే ఒకే వంటకాన్ని మలేషియాలో యీ సాంగ్ అని, సింగపూర్‌లో యూషెంగ్ అని పిలుస్తారు. కొత్త సంవత్సరాది వంటకంగా పేరున్న దీన్ని తమదంటే తమదేనని వాదులాడుకుంటున్నాయా రెండు దేశాలు. 2009లో మలేషియా తమ జాతీయ వంటకాల లిస్ట్‌లో దీని పేరు రాసేసి మంటను మరింత రాజేసింది. వెంటనే సింగపూర్ ప్రభుత్వం

...డవలు!

...గుర్తొస్తాయి. గానీ కొన్ని ...ు. కానీ అందరి హాట్ ...ేసుకునే గోలెక్కువైపోతోంది.వంట ...తం. నోరారా ఆస్వాదించక ... వివరాలు.



తమ జాతీయ వారసత్వంగా గుర్తించాలని ఏకంగా యునెస్కోకే దరఖాస్తు చేసేసింది. వీరిద్దరి గొడవ మధ్యలోకి జపాన్ కాలమిస్ట్ మీ షు జెన్ తలదూర్చి చేపల్ని పచ్చిగా తినేయడం వందల ఏళ్ల నుంచి మా అలవాటంటూ దానిపై హక్కు జపాన్‌దేనంటూ కొత్త వాదన లేవనెత్తాడు. కాంటోనియన్ రెసిప్‌లాగుందని, బ్రిటీష్ కాలనీల ప్రభావం వల్ల ఎవరదనేది తేల్చడం కష్టమని పరిశోధకులు స్పూన్‌లు పక్కన పెట్టేశారు.

ఇవే కాదు.. ఫెటా జున్ను విషయంలో గ్రీస్‌కు, యూరోపియన్ యూనియన్‌కు పెద్ద తగవే సాగుతోంది. కిమ్చి అనే వంటకంపై దక్షిణ కొరియా, జపాన్ పేచీ పెట్టుకున్నాయి. రష్యా బ్యాలెరీనా అన్నా పావ్‌లోవ్ పేరిట ప్రత్యేకంగా గరిటె తిప్పిన పావ్‌లోవా వంటకంపై గురించి ఆస్ట్రేలియా, న్యూజిల్యాండ్‌లు.. చిమిచంగా అనే బురిట్రో కోసం మెక్సికో, అరిజోనా.. హమ్మస్‌ను నంజుకు తినడం కోసం లెబనాన్, ఇజ్రాయిల్.. క్రోసియంట్ ముక్క కోసం ఫ్రాన్స్, ఆస్ట్రియాలు కారాలు, మిరియాలు నూరుతున్నాయి. ఇంత వాదులాడుకుంటున్నా ఈ పసందు విందు ప్లేట్‌లో పడగానే ఫిరాయించేసి లొట్టలేసుకుంటున్నారు. వాహ్ టేస్ట్ గురూ అంటూ తినిపించుకుంటున్నారు. ఇవీ తిండి గొడవలు.



\- అనఘ

చికెన్ టిక్కా చిక్కు

ఒక్కో ఊరి రోటి మసాలాదో ప్రత్యేకత చికెన్ విషయంలో. కానీ దేశ విదేశాలను దాటిపోయాయి చికెన్ టిక్కా మసాలా ఘుమఘుమలు. యాభై ఏళ్ల కిందట పంజాబీయుల వంటింట్లో అనుకోకుండా గుప్పుమందని అంటారు. అంటే పోపు దినుసుల డబ్బాల వరస మారిపోయి ఇది తయారైంది. కానీ తెల్లోళ్లు మాత్రం మా చెఫ్‌ల రుచి చూపించిందిది అని గొడవకు దిగుతున్నారు. గ్లాస్గోలో నూరిందని ఇది బ్రిటీషర్ల జాతీయ వంటకమని ఓ యూకే మంత్రిగారు సెలవిచ్చుకున్నారు కూడా. ఆయన ఎంత గొంతు చించుకున్నా ఇండియాలో మాత్రం చపచపా చప్పరించేస్తున్నారు.

కదిలించే గ్రామం కథ..

చరిత్ర పుటల్లో సాక్షీభూతంగా నిలిచిన ఈ గ్రామం గురించి ఓ ఉద్గ్రంథమే రాశారు ఈడుపుగంటి ప్రహ్లద. వీరు ఉద్యోగరీత్యా అనేక ఏళ్ల కిందటే హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. స్వగ్రామం మీదున్న మమకారం.. ఉత్తేజభరితమైన ఆ ఊరి చరిత్రను నిక్షిప్తం చేయాలన్న తపన.. ఆయనను ఈ గ్రంథ రచనకు పురికొల్పాయి. 12వ శతాబ్దంలో గజపతిరాజుల పాలనలో ఈ గ్రామమున్నట్లూ..బ్రాహ్మణులకు అగ్రహారంగా దానం చేయబడినట్లూ రచయిత పేర్కొన్నారు. మన జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్యది ఆ ఊరే కావడం, స్వాతంత్ర్య సమరంలో నాటి గ్రామస్థులు నిర్వహించిన వీరోచిత పోరాటాలు, త్యాగాలు, గ్రంథాలయోద్యమం, ఖద్దరు ఉద్యమం, మద్యపాన వ్యతిరేకోద్యమం వంటివి పేర్కొనడం చిన్న విషయమేం కాదు. స్వాతంత్రోద్యమంలో పాల్గొన్న గ్రామస్తులను పోలీసులు ఎలా చిత్రహింసలు పెట్టిందీ కళ్లకు కట్టినట్లు రాశారు. స్వాతంత్రోద్యమ ఘట్టాలను తేదీలతో సహా రాయడాన్ని బట్టి చూస్తే రచయిత స్వాతంత్రోద్యమ కాలంనాటి అనేక

భట్లపెనుమఱ్ఱు
గ్రామచరిత్ర
రచన- సేకరణ: ఈడ్పుగంటి ప్రహ్లాద్
వెల : రూ 300
పేజీలు :448
ప్రతులకు :
ప్రహ్లాద్ - 9642515070

పుస్తకాలను అధ్యయనం చేసినట్లు విదితమౌతోంది. ఈ ఊరికి ఉన్న మరో గర్వకారణమైన చరిత్ర కమ్యూనిస్టు ఉద్యమ చరిత. స్వాతంత్రోద్యమంలో అనేకులు చిత్రహింసలు, జైలు జీవితాలు అనుభవించారేమోకానీ, ఈ ఊరి కమ్యూనిస్టు ఉద్యమంలో ఏడుగురు యువకులు ఆత్మబలిదానాలనే చేశారు. ఒళ్లు జలదరించేంత.. రోమాలు నిక్కబొడిచేంత.. త్యాగమూ, వీరత్వమూ ప్రదర్శించిన ఏడుగురు కమ్యూనిస్టుల అమరత్వాన్ని ఉత్తేజభరితంగా చిత్రించారు. భూమి కోసం, భుక్తి కోసం, బానిసత్వ విముక్తి కోసం కంకణధారులై ఆ లక్ష్యసాధనలో చిన్నవయసులోనే కాంగ్రెస్ ప్రభుత్వ కసాయి తుపాకీ గుళ్లకు నేలకొరిగిన వారి ఆత్మ బలిదానం ఉత్తర భారతదేశ విప్లవ వీరుల జీవితాలకు ఏ మాత్రం తీసిపోదు. ఈ చరిత్రలతోపాటు గ్రామానికి చెందిన అనేక విషయాలు ఆసక్తి కలిగిస్తాయి. ఈ గ్రామం నుంచి వెళ్లిపోయిన అనేక మంది విదేశాల్లోనూ, దేశంలోనూ, రాష్ట్రంలోనూ ఏ విధంగా పైకి వచ్చిందీ.. ఏయే స్థానాలు అలంకరించిందీ రచయిత ఎవరినీ వదిలిపెట్టకుండా పూసగుచ్చినట్లు ఇవ్వగలిగారు. గ్రామం మొత్తంగా ఆయా కుటుంబాల కుదుర్ల (వంశవృక్షం) గురించి ఈ నాటి వారి కుటుంబీకులకు కూడా తెలియని సమాచారం ఇచ్చారు. అయితే ఇందులో ఒకే సామాజిక తరగతివారి గురించి ఎక్కువగా ఇవ్వడం, ఇతర సామాజిక తరగతులవారివి తక్కువగా ఇవ్వడం లోపమే. గ్రామాభివృద్ధికి సంబంధించిన ఫొటోలు ఏదీ వదిలిపెట్టకుండా ఇచ్చారు. కానీ దేశం కోసం ఏడుగురు ఆత్మబలిదానం చేసిన కమ్యూనిస్టుల యోధులకు గుర్తుగా నిర్మించిన స్మారక స్థూపం ఫొటో పెట్టకపోవడం పెద్ద వెలితి.

- ఉష్ణ

సంబంధాల సంఘర్షణ

భూమి మీద మరే జీవికి లేని ప్రత్యేకత మనిషిది. ఇక మానవ సంబంధాల్లోని వైరుధ్యాల గురించైతే చెప్పనవసరం లేదు. సుదీర్ఘంగా సాగే జీవనయానంలో ఎన్నో పాత్రలు వస్తుంటాయి, వెడుతుంటాయి. వీరిలో కొందరి ప్రభావం జీవితమంతా వెంటాడుతుంది. సాగర్ శ్రీరామకవచం దహనం నవల మానవ సంబంధాల్లోని సంఘర్షణకు అద్దం పడుతుంది. 1897 సంవత్సరంలో ప్రారంభమైన ఈ కథ అనంతర సంవత్సరాల్లో సాగుతుంది కాబట్టి కాలానుగుణంగా నాటి దేశ పరిస్థితుల ప్రస్తావన ఉంటుంది. నాటి స్వాతంత్ర పోరాటం, ఆ పోరాటంలోని రకరకాల వాదాలు, ఆ పోరాటాన్నీ స్వార్థానికి ఎలా ఉపయోగించుకోవాలంటూ కొందరు చేసే ఆలోచనలు నవలలో కనిపిస్తాయి. ప్రధానంగా ఒక బ్రాహ్మణ ఉమ్మడి కుటుంబం. ఆ కుటుంబంలోని సభ్యులు, వారి మధ్య ఉన్న అన్ని రకాల సంబంధాలు, వాటి వికృత రూపాలు ఏ పరిణామాలకు దారి తీశాయన్నది ఈ నవల

దహనం
రచన : సాగర్ శ్రీరామకవచం
వెల :80/-
పేజీలు :184/-
ప్రచురణ : గుండ్లకమ్మ రచయితల సంఘం
ప్రతులకు : ఉషారాణి శ్రీరామకవచం
సెల్ : 9885473934

సారాంశం. పల్లె నుండి ప్రారంభమై రకరకాల ప్రాంతాలకు కథా గమనం విస్తరిస్తుంది కాబట్టి దానికి తగ్గట్టుగానే పాత్రల సంభాషణలు సాగుతాయి. రకరకాల వ్యక్తులకుండే ఆలోచనలు. వారి స్వార్థాలు, సంపాదన కోసం పడే పాట్లు, ఒక్కోసారి ఆస్తి కోసం ఎంతకైనా బరితెగించే తీరు, మోహావేశాలు, అక్రమ సంబంధాలు, నమ్మకాలు, మూఢత్వాలు ఒక్కటేమిటి మానవ మినీ ప్రపంచం సాక్షాత్కారిస్తుంది. బ్రాహ్మణ కుటుంబంలో పుట్టిన శ్రీరాములు, అతని అన్న అప్పన్న చుట్టూ ఈ కథ సాగుతుంది. వీరిరువురూ కేంద్రంగా ఎన్నో పాత్రలు పాఠకులను పలకరిస్తాయి. అన్న అప్పన్న చెడు గుణాల పుట్ట! కుటుంబ సభ్యుల ఒత్తిడితో పెళ్లి చేసుకున్న శ్రీరాములు శోభనం జరగక ముందే సన్యాసం పుచ్చుకుంటాడు. ఆ తరువాత అతని జీవితం ఎలా సాగింది? కోటి ఆశలతో శ్రీరాములుకు భార్యగా వచ్చిన స్త్రీ జీవితం ఏమైంది? అప్పన్న చెడు గుణాలు వదిలి మంచి మనిషిగా మారాడా? అసలు శ్రీరాములుకు సన్యాసం తీసుకోవలసిన అవసరం ఏమొచ్చింది? వీరిద్దరి జీవితాలు ఎలా ముగిశాయి? ఈ ప్రశ్నలకు సమాధానం కోసం నవల చదవాల్సిందే. పుస్తకం నిండా ఎన్నో పాత్రలు, సంభాషణలు ఉన్నా కథనంలో ఎక్కడా పట్టు సడలకపోవడం ఈ నవల ప్రత్యేకత. సజీవమైన పాత్రలు, అంతే సజీవమైన సంభాషణలు, ఆకట్టుకునే కథనం పాఠకుడిని గుక్క తిప్పుకోనివ్వకుండా అక్షరాల వెంట పరుగులు తీయిస్తుంది. కొత్త అనుభూతిని మిగులుస్తుంది.

- వి.రాజగోపాల్

ఆకలి తీరుస్తోన్న 'రాబిన్‌హుడ్'

ముంబై, ఢిల్లీ, బెంగుళూరు, హైదరాబాద్ నగరాల్లో ఫ్లై ఓవర్లు, చీకటి దారుల వెంట తిరిగే కొందరు యువకుల్ని చూసి అక్కడి ప్రజలు భయపడేవారు. అర్ధరాత్రి బైక్‌లపై తిరుగుతుండే యువకుల్ని రేసర్లని కొందరనుకుంటే, అల్లరి మూకలుగా మరికొందరు అనుకునే వారు. అలా అనుకున్న వారందరికీ కొంత కాలానికి తెలిసిందేంటంటే పచ్చని టీ షర్ట్‌ల్ని ధరించిన ఆ గ్యాంగంతా కూడా తమతో తెచ్చిన ఆహారాన్ని రోడ్లపై ఉండే వారికి అందించే రాబిన్‌హుడ్ ఆర్మీ అని. సంపన్నుల వద్ద పేరుకుపోయిన సొమ్ముని దోచుకెళ్లి బీదలకి పంచిన 'రాబిన్ హుడ్'ని ఆదర్శంగా తీసుకున్న ఈ బృందం ఆహారాన్ని దోచుకోదు గానీ, వివిధ సందర్భాల్లో వృధా అవుతున్న ఆహారాన్ని సేకరించి ఆకలితో అలమటించే వారికి పంచి పెడుతుంది.



భారత్‌లో పేదవారి ఆకలి తీర్చడం కోసం ఎన్నో స్వచ్ఛంద సంస్థలు పని చేస్తున్నా ఆకలి మంట ఏదో మూల పేగును మెలిపెడుతూనే ఉంది. బతుకు దెరువు కోసం పల్లెల నుండి వలస వచ్చే వారితో పాటు పని దొరక్క ఆకలితో ఏ మూలనో నక్కి పడుకునే వారిని వెతికి మరీ ఆహారాన్ని అందించడమే రాబిన్ హుడ్ సంస్థ లక్ష్యం. ఢిల్లీకి చెందిన నీల్ ఘోష్(26) ఈ స్వచ్ఛంద కార్యక్రమానికి రూపకర్త. పోర్చుగల్‌లో ఆహార వృధాని తగ్గిస్తూ పేదల్ని ఆదుకుంటున్న 'రీ ఫుడ్' సంస్థకి వలంటీర్‌గా పనిచేసిన నీల్ ఘోష్ ఆ సేవా కార్యక్రమాల పట్ల ప్రభావితుడయ్యాడు. స్వదేశంలో కూడా పోర్చుగల్ 'రీ ఫుడ్' తరహాలో సేవలందించాలని నిర్ణయించుకున్నాడు. మిత్రుడు ఆనంద్ సిన్హా (27)తో కలసి 2014 జూన్‌లో ఢిల్లీలో రాబిన్ హుడ్ ఆర్మీని నెలకొప్పాడు. తొలుత ఆరుగురు సభ్యులతో మొదలైన ఈ బృందం వందలాది వలంటీర్లతో ఇప్పుడు వివిధ రాష్ట్రాలలో సేవలందిస్తోంది. లాయర్లు, డాక్టర్లు, ఇంజనీర్లుగా పనిచేస్తున్న కొంతమంది వలంటీర్లుగా మారి ప్రతి ఆదివారం రాత్రి 10-11 గంటల మధ్య పలు రెస్టారెంట్ల వద్దకి చేరుకుంటారు. అక్కడ వృథాగా ఉన్న ఆహారాన్నంతా సేకరించి నగరంలోని వివిధ వీధుల్లోకి చేరుకుంటారు. రోడ్లపై ఆకలితో అలమటిస్తుండే వారికి ఈ ఆహారాన్ని అందిస్తారు. ఢిల్లీ నగర వీధుల్లో తొలి ప్రయత్నంలోనే 80 మందికి ఆహారాన్ని అందించగలిగింది రాబిన్ హుడ్ సేన. అక్కడి నుండి ముంబై, బెంగుళూరు, జైపూర్ ఇలా ప్రతి నగరంలోని యువత చేయి కలపింది. 2014 ఆగస్టులో హైద్రాబాద్‌లో ఒక పెళ్లి విందు పూర్తయ్యాక రాబిన్‌హుడ్ ఆర్మీ అక్కడికి చేరుకుని సేకరించిన ఆహార పదార్థాలను అప్పటికప్పుడే దాదాపు 970 మంది పేదలకు అందించగలిగింది. ఎక్కువ మందికి సాయపడాలనే లక్ష్యంతో పనిచేస్తున్న సంస్థకి ఇదొక మంచి అవకాశంగా అనిపించింది. అప్పటి నుంచి రెస్టారెంట్‌లతో పాటు వివిధ కార్యక్రమాల్లో వృథా అవుతున్న ఆహారాన్ని సేకరించే పనిలో పడిందీ బృందం. ఆహార పదార్థాల కోసం వెళ్లే వలంటీర్లను కొందరు కసురుకునే వారు, మరికొందరు తమ రెస్టారెంట్‌లో భోజనం లేకపోతే అప్పటికప్పుడు వండి మరీ అందించేవారు. ఒక్కో చోటా ఒక్కో అనుభవాన్ని చవిచూస్తూ ఎంతో ఓపిగ్గా పనిచేసేవారు వలంటీర్లు. జనవరి నుండి నవంబర్ నెలలు ఎంతో కీలకం అంటారు ఆనంద్. ఎందుకంటే భారత్‌లో పెళ్లిళ్ల సీజన్ అదే కావడంతో, ఎక్కువగా ఆహారం వృథా అయ్యేది ఇలాంటి సందర్భాల్లోనే అంటారు ఆనంద్. జైపూర్‌లోని (సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ కమ్యూనికేషన్స్) సిడిసి, పేరొందిన ఒక ఎన్‌జివో సంస్థ సంయుక్తంగా నిర్వహించిన సర్వే ప్రకారం ఏడు నెలల్లో జైపూర్‌లో జరిగిన పెళ్లి విందుల్లో లక్షలాది కిలోల ఆహారం వ్యర్థమైందని తేలింది. ఇలా ఆహారం వ్యర్థం కాకుండా ఉండేందుకు పెద్ద మొత్తంలో సేకరించిన ఆహారాన్ని అప్పటికప్పుడు పంచిపెట్టడంతో పాటు మిగిలిన ఆహారాన్ని ప్రిజర్వేటర్‌లలో భద్రపరుస్తారు. మరుసటి రోజు భద్రపరిచిన ఆహారంలో బాగున్న వాటిని పేదలకు అందిస్తారు.



సామాజిక మాధ్యమాల ద్వారా ఈ సంస్థ వివిధ నగరాల్లోని పెద్ద రెస్టారెంట్లకు మరింతగా చేరువయ్యింది. కాలానికి అనుగుణంగా ఆహారంతో పాటు బట్టలు, మంచి నీటిని అందించడంలో భారత్‌లో రాబిన్ హుడ్ ఆర్మీ తరపున 400 మంది వలంటీర్లు కృషిచేస్తున్నారు.

పాకిస్తాన్ ఆకలినీ..

ఆహార సంస్థల నివేదికల ప్రకారం పాకిస్తాన్‌లో 40 శాతం మంది పౌష్టికాహారం అందని బాలలతో పాటు, తక్కువ బరువు కలిగినవారున్నారు. దీనికి కారణం సరిపడినంత ఆహారం వారికి అందకపోవడమే. పాకిస్తాన్‌లోనూ పేదరిక ఛాయలు భారత్‌ని పోలి ఉంటాయి. ఈ విషయాలన్నీ లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో చదువుకునేప్పుడే నీల్ ఘోష్ తెలుసుకున్నాడు. రాబిన్‌హుడ్ ఆర్మీ సేవలు ఎంతో మంది పేదలకు చేరువవడంతో లండన్‌లో తన మిత్రుడు షరా అఫ్రిదీ సాయంతో తమ సేవల్ని పాకిస్తాన్‌లోనూ అందిస్తున్నారు. అక్కడ సుమారు 250 మందితో ఒక బృందంగా ఏర్పడిన వలంటీర్లు ప్రస్తుతం కరాచీతో పాటు మరి కొన్ని ప్రదేశాల్లోని రెస్టారెంట్‌లలో ఆహారాన్ని సేకరించి పేదలకి అందించే ప్రయత్నం చేస్తున్నారు.

- శర్వాణి

పెళ్లంటే తానాడుకునే బొమ్మల కొలువు ముచ్చట అనుకుంది ఓ చిన్నారి. అత్తారిల్లంటే అక్కడా అంత కంటే పెద్ద బొమ్మలాట చూడొచ్చని అనుకుంది. తండ్రంత వయసున్న భర్త తన నాన్నలా మరిన్ని బొమ్మలు కొనిపిస్తాడని పెళ్లి వేడుకలో నవ్వులు కురిపించింది. కానీ తన జీవితమే ఓ బొమ్మలాట అయి పోతుందని ఏం తెలుసు. అందుకే కృతి భారతీ ఆ బంగారుబొమ్మలకు తోడుగా నిలుస్తోంది. బాల్యవివాహాలు ఎక్కువగా జరుగుతోన్న రాజస్థాన్‌లో ప్రాణాలకు తెగించి బాలికల్ని కాపాడుకునే ప్రయత్నం చేస్తోంది. గత నాలుగేళ్లలో 900 బాల్య వివాహాలను రద్దు చేయించిన కృతికి 50కి పైగా చావు బెదిరింపులు వచ్చాయి.

బాలికల రక్షకి

ఎంత ఆధునిక యుగంలోకి పరుగు తీస్తున్నా అర్థం పర్థం లేని కొన్ని ఆచారాల వికృత అవశేషాలు సంప్రదాయాల రూపంలో ఇంకా చలామణీ అవుతున్నాయి. ఈ కోవకు చెందినవే బాల్య వివాహాలు. అయితే వాటి బారిన పడి బాల్యాన్ని కోల్పోతూ మొగ్గ వయసులోనే తునిగిపోతున్న చిన్నారుల కోసం, వారి భవిష్యత్తు కోసం కృతి భారతి కృషి చేస్తోంది. ఇరవై తొమ్మిదేళ్ళ కృతి 'సారథీ' ద్వారా 6000 మంది పిల్లలకు, 5500 మంది మహిళలకు పునరావాసం కల్పించటంలో సఫలీకృతురాలైంది. ప్రపంచంలోనే 40 శాతం పిన్న వయసులో వివాహాలు భారతదేశంలోనే జరుగుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ముఖ్యంగా రాజస్థాన్‌లో ఇవి ఎక్కువగా కన్పిస్తున్నాయి. ఒక బాల్య వివాహాన్ని ఆపటం జరిగితే ఆ బాలికను అక్కడి సమాజం నుంచి బహిష్కరించినట్లే. అటువంటి పరిస్థితుల్లో ఆ బాలికకు పునరావాసం కల్పించటమే కాకుండా సమాజంలో ఆమె స్థానం తిరిగి పొందేలా సహకరించటం ఇక్కడ చాలా ప్రధానమైన విషయం అంటారు కృతి. పిల్లలకు వారి కుటుంబ సభ్యులకు ఇంకా గ్రామానికి చెందిన పాలక వర్గాలకు కౌన్సిలింగ్ నిర్వహిస్తారు. స్కూళ్ళలోనూ జన సామాన్యం ఎక్కువగా సంచరించే ప్రదేశాలలోను క్యాంప్‌లు నిర్వహిస్తారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతుంటే హెల్ప్‌లైన్ ద్వారా సమాచారం అందించేలా సమాయత్తం చేయటం క్యాంప్‌ల ప్రధాన ఉద్దేశం. అన్నింటికన్నా పెళ్లి రద్దు చేయటమే ఓ పెద్ద సవాల్. ఎందుకంటే ఇరు వర్గాల నుంచే కాక గ్రామ పెద్దల నుంచి కూడా సమ్మతి అత్యంత ఆవశ్యకం. కొన్ని జటిలమైన కేసులలో కృతి ఆమె టీంపై దాడులు కూడా జరిగాయి. అలాంటప్పుడు చట్టం ద్వారా సహాయం తీసుకున్న సందర్భాలున్నాయి.

ఈ మధ్యకాలంలో కృతి ఓ పెద్ద సాహసం చేసి ఓ బాలికను రక్షించింది. 17 ఏళ్ల ఓ బాలికా వధువు తాగుబోతు భర్తకు భయపడి దూరంగా పారిపోయింది. ఆమెను రక్షించటానికి కృతి తన ప్రాణాన్ని కూడా పణంగా పెట్టింది. మొదట ఆ అమ్మాయిని కృతి ఓ రోజు ఉదయం నాలుగు గంటల ప్రాంతంలో ఎడారి నడిబొడ్డున ఒక చెట్టు వెనుక భయంతో వణికిపోతూ దాక్కొని ఉండగా చూసింది. వెంటనే ఆమెను చేరుకుని కొన్ని గంటలపాటు అక్కడే నిలిచిపోయింది. ఆమెను వెతుక్కుంటూ తిరిగిన ఆ తాగుబోతు భర్త దాడి చేసే అవకాశం ఉన్నా కూడా జంకలేదు. కారు రాగానే అందులోకి బాలికను తరలించి అక్కడి నుంచి తప్పించింది. ఆ బాలికకు ఐదేళ్ళ క్రితమే వివాహం జరిగింది. బాల్య వివాహం తర్వాత కూడా పుట్టింట్లోనే ఉన్న వధువును యుక్త వయసుకు వచ్చాక అత్తవారింటికి పంపటాన్ని 'గౌన' అంటారు. అలా ఆమె అత్తారింటికి వెళ్లడానికి ఇష్టపడలేదు. మానసికంగా హింసించి కొట్టటం కూడా మొదలు పెట్టారు. రోజు రోజుకూ, పరిస్థితి అధ్వానంగా మారుతుండటంతో ఇక తట్టుకునే శక్తి ఆమెలో నశించి అర్ధరాత్రి ఇల్లు వదిలి పారిపోయి ఎడారిలో చిక్కుకుంది. కృతి ఆమెను బార్‌మర్ పట్టణంలోని బాలల సంక్షేమ సంఘంలో చేర్చింది. అక్కడి నుంచి జోధ్‌పూర్‌లోని సంక్షేమ సంస్థకు తరలించింది. వారు ఆమెను ప్రభుత్వ బాలికల ఆశ్రయ గృహానికి అప్పగించారు. పెళ్ళి రద్దు చేయించే క్రమంలో బాధితురాలికి రక్షణ కల్పించటం కృతికి కొంచెం ఆందోళన కల్గిస్తోంది. ఎందుకంటే ఆమె రాజస్థాన్‌లోని పచ్ పాద్రాలో భన్ దియావాస్ కులానికి చెందింది. ఆ కులంలో పరువు హత్యలు సర్వ సాధారణం.



ముక్క పచ్చలారని పసివారిని ఈ దుర్భర జీవితాల నుంచి రక్షించాలని ఆరాటపడుతున్న కృతి తన పసివయసులోనే ఎన్నో కష్టాలు చవి చూసింది. తండ్రి ఓ డాక్టర్. కృతి కడుపులో ఉండగానే తండ్రి తల్లిని వదిలేశాడు. తల్లి తరపు బంధువులంతా గర్భస్రావం చేయించుకొని పునర్వివాహం చేసుకోమని సలహా ఇచ్చారు. పసిపిల్లగా ఉన్నప్పుడే కృతిపై విష ప్రయోగం జరిగింది. ఆ తర్వాత చదువు మానేయాల్సిందిగా ఆమెపై ఒత్తిడి వచ్చింది. పట్టుదలగా విద్యాభ్యాసాన్ని కొనసాగించి ప్రస్తుతం బాలల సంరక్షణ భద్రత అనే అంశంపై పి.హెచ్.డి చేస్తోంది. ఎంతో కఠినతరమైన సాహసోపేతమైన కృతి భారతి సేవలకు గాను బ్రిటన్ నుండి ఫెలోషిప్‌నే గాక పలు అవార్డులను కూడా అందుకుంది. చట్టబద్ధంగా బాల్య వివాహాలను వేగవంతంగా రద్దు చేయించినందుకు గాను ఆమె పేరు భారతదేశంలోని లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి ఎక్కింది. అందరికీ స్ఫూర్తినిచ్చే ఆమె కథ దేశ వ్యాప్తంగా చిన్నారుల ప్రాథమిక బోధన ప్రణాళికలో చేర్చబడింది.

- సింహాద్రి నాగ శిరీష

చినుకు సంబరం



ఉక్కపోత జీవితంలో
ఉన్నట్టుండి మబ్బులు
ఉరమటం మొదలెట్టాయి.

ఎండకు తడిసిన తనువులు
చినుకు సంబరంతో
మట్టి మధ్య మొలకెత్తుతున్నాయి.

నా గాలిలో మట్టి పరిమళం
నా శ్వాసలో ఆశను రేపింది.

చినుకు తడితో మట్టి పులకించినట్లు
మట్టిని తాకిన ఒళ్ళు జలదరించిపోతోంది.

పిడికెడు మట్టిని పట్టిన
దోసిళ్లలోకి రాలిన నా కన్నీళ్లు
ఆనందాశ్రువుల్ని పోగు చేస్తున్నాను.

గుప్పెడు గుండెలో
వెలుగు వరదల్ని నింపే
నీటిలో పులకరించిపోతున్నాను.

నాగలితో దున్నుకోడానికి
ఒక ఆకాశం వచ్చి వాలినందుకు
ఒక చినుకుగా మాట్లాడినందుకు
పూల వర్షంలా జారినందుకు
తనువు బహుముఖంగా
పులకరిస్తోంది.
గాలిసయ్యాటలాడుతోంది
మనసు ఊగుతోంది
పల్లె పరవశంలో
మనసు మునుగుతోంది.

నా మట్టంటే
బహుమానమంత అభిమానం
కాలం మీద చెప్పుకున్న కబుర్లన్నీ
నా మట్టితో నిండిన అనుభవాలే.

చినుకు కురిస్తే చాలు
చిగురించే చెట్టునవుతాను
పరవశించే నెమలినౌతాను
ఆకాశానికి వేలాడే
ఇంద్ర ధనుస్సునవుతాను.
మనిషినవుతాను
మట్టిని నమ్ముకున్న
రైతు బిడ్డనవుతాను
మట్టిని మోసే మనిషిని
మనిషిని నడిపే మట్టినీ అవుతాను

గవిడి శ్రీనివాస్
- 08886174458

ఆహ్వానం

మీ కవితలు పంపాల్సిన చిరునామా:
స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ.-520002.
మెయిల్ అడ్రస్
:snehaweekly.praja@gmail.com

నాన్నకు.......

జారిపోతున్న కాలంలో
నీ ఆలోచనల దొంతరలే
నా మనస్సును కప్పేసాయి
నీవు భౌతికంగా లేకున్నా
నిత్యం నీతో ఆత్మీయ ఆలింగనం
చేసుకుంటూనే ఉన్నా
నువ్వు నాకు జన్మనిచ్చావు
కానీ....
నేను నీకు ఏమీ
ఇవ్వలేకపోయాననే వెలితి
నన్ను వేట కుక్కలా
వెంటాడుతుంది
మది నుండి జారిపోయే
ఆలోచనలు
కంటి నుండి రాలిపోయే నీటి
చారలు,
గుండె కొలిమిలో
మాడిపోతున్నాయి
ఆహ్వానించలేని తలంపులు
సముద్ర హోరునే మరిపిస్తున్నాయి
గత జ్ఞాపకాలు వడగాలులే
అయినాయి
మానవ సంబంధాల మత్తులో
మానని గాయాల నీ జ్ఞాపకాలతో
మౌనంగానే
పలకరిస్తున్నా...నాన్న....
నీ శ్వాసతోనే నిత్యం సహవాసం
చేస్తున్నా
నీ ఆశలనే స్వప్నిస్తున్నా
అవి నిజం చేయాలనే,
నే కాలంతో పరిగెడుతున్నా.

కళ్యాణ్ కుమార్
- 8341136796

క థ



నమ్మకం

దాసరి శివకుమారి
- నెం: 9866067664

ఉదయం ఏడు గంటల సమయం. రోజు ఈ టైమ్ కల్లా రంగమ్మ ఖాళీ క్యారియర్ తీసుకుని ఫ్లాట్లలో పనులు చేయటానికి బయలుదేరుతుంది. ఈ రోజు మాత్రం సెల్లార్‌లోకి తమ గది లోపలికి మాటి మాటికి కంగారుగా తిరుగుతోంది. ఎదురు అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా తమ బంధువే ఉంటున్నాడు. తన కొడుకుకి తోడుగా అతన్ని పంపింది సారా కొట్టు దగ్గరకు. ఆ కొట్టు దగ్గర తన మొగుడేమైనా రాత్రి తాగి పడిపోయి వుంటాడేమోనన్న అనుమానంతో. ఎంత తాగినా రాత్రి పూట ఇంటికి వచ్చేసేవాడు. ఈ సారి మాత్రమే ఇలా జరిగింది. తమ డబ్బుతో ఎంత తాగినా తను భరించగలుగుతుంది. తన పిల్లల అవసరాలను ఎన్నింటినో వాయిదా వేసుకోగలుగుతుంది. కాని ఇప్పుడు జరిగింది వేరు. నెలలో మొదటి వారంలో అపార్ట్‌మెంట్ మెయిన్‌టెన్స్ వసూలు చేస్తారు. దాని తాలూకు డబ్బులు నిన్న పదివేలు జమ పడింది. కమిటీ ప్రెసిడెంట్‌కు ఆ డబ్బు చేరలేదు. వసూలు చేసిన వాచ్‌మెన్ సుబ్బారావు నిన్న మధ్యాహ్నం నుండి కనపడటం లేదు.

"రంగమ్మా! ఇంత వరకూ సుబ్బారావు రాలేదు. పది వేలతో పరారయ్యాడు. ఇంతకు ముందు చాలా పొరపాట్లు చేశాడు. క్షమించి వదిలేశాం. నీ మంచితనం, పిల్లల ముఖాలు చూసి సర్దుకుపోయా.. అపార్ట్‌మెంట్ కమిటీ ప్రెసిడెంట్‌గా నేను ఇరవై ఫ్లాట్ల వాళ్ళకూ సమాధానం చెప్పాలి. నమ్మకం పోగొట్టుకున్నాడు. తన జీతమంతా ముందే అడ్వాన్సుగా తీసుకుని వాడేసుకుంటాడు. ఇప్పుడు పదివేలు ఎలా జమ చేస్తాడు?"

"కొంచెం టైమివ్వండి అయ్యగారూ! నేను ఆ డబ్బు సర్దుబాటు చేస్తాను. పనిచేసే ఇళ్లల్లో అడిగి తెచ్చి ఇస్తాను. తనంతట తాను ఇట్లా చెయ్యడు. ఎవరో చెప్పి తీసుకువెళ్లుంటారు."

"మొగుడి మీద ఈగ వాలనివ్వవుగా. ఇవాళ్ళ కొత్తేముంది? సాయంకాలం మీటింగ్ పెడతాం. అందరూ ఏమంటారో వినాలి."

మరో గంట గడిచింది. కొడుకొక్కడే తిరిగొచ్చాడు. నాన్న రాత్రి ఆ కొట్టు దగ్గరకే పోలేదంట. ఏ గుంటూరో పోయుంటాడని అక్కడి వాళ్ళు చెప్పారు." అని తల్లితో చెప్పాడు. రంగమ్మ బాగా ధైర్యవంతురాలు, ఆలోచనపరురాలు. నిబ్బరంగా వుంటూ పనులు చక్కపెడ్తూ వుంటుంది. పది ఫ్లాట్‌ల వాళ్ళకు రోజువారి పనులు చేస్తూ వుంటుంది. మిగతావారికి ఏదైనా అవసరం వస్తే కాదనకుండా ఏదో ఒక సమయంలో సాయం చేస్తూ వుంటుంది. అందరి అభిమానం సంపాదించుకుంది. రంగమ్మ మంచితనం వల్ల సుబ్బారావు సోమరితనాన్ని అపార్ట్‌మెంట్ వాసులు భరిస్తున్నారు. అతణ్ణి వాచ్‌మెన్‌గా కొనసాగిస్తున్నారు.

తెల్లవారేప్పటికి ఇస్త్రీ గుడ్డల మూటలు తీసుకుని అచ్చయ్య అపార్ట్‌మెంట్‌కు వచ్చేసాడు. పగలంతా ఇస్త్రీ చేస్తూనే ఉంటాడు. ఒక్కోసారి రాత్రి పొద్దుపోయే వరకు కూడా ఇస్త్రీ చేస్తూనే ఉంటాడు. ఇస్త్రీ చేయగ మిగిలిపోయిన బట్టలు ఏమైనా ఉంటే సుబ్బారావన్నా కాస్త ఈ గుడ్డల్ని చూస్తూ వుండు రేప్పొద్దున్నొచ్చి ఇస్త్రీ చేసి ఎవరి గుడ్డలు వాళ్లకిచ్చేస్తాను అంటాడు.

సుబ్బారావుకీ, అచ్చయ్యకు బాగా స్నేహం కుదిరింది. పని చేసే ఇళ్ళల్లో నుంచి రంగమ్మ తెచ్చే

ఫలహారాల్లో నుంచి అచ్చయ్య కూడా వాటా ఇస్తున్నాడు సుబ్బారావు. బాగా చలిగాలిలో పడి వచ్చావు అచ్చయ్యనా! టీ పెట్టుకొస్తానుండు అంటూ తేనీటి సత్కారాలు చేస్తూ వుంటాడు. ఫ్లాట్ల వాళ్ళు కిందికి వస్తూ పైకిపోతూ సుబ్బారావ్! పై కెళ్ళి కారిడార్లన్నీ ఊడ్చి శుభ్రం చేసిరా అచ్చయ్య పనిచేసుకుంటున్నాడు.నువ్వు మాత్రం కూర్చుని కబుర్లు చెప్తున్నావు. ఎండ పడుతున్నది గుమ్మాల ముందు ముగ్గులు పెట్టుకునేవారికి బాగా లేటవుతుంది' అని హెచ్చరిస్తూ వుంటారు. తొమ్మిది గంటలకంతా ఆఫీసులకెళ్ళేవాళ్ళు, కాలేజీలకు, స్కూళ్లకు వెళ్ళే వాళ్ళంతా బయటకు వెళ్ళిపోతారు. అప్పుడు తీరిగ్గా కర్రకు కట్టిన పుల్లల చీపురొకటి తీసుకుని కిందంతా శుభ్రం చేయడానికి బయల్దేరుతాడు సుబ్బారావు. పోగుపడ్డ చెత్తా చెదారం ఒక మూలకు తోసేస్తాడు. దాన్ని ఎత్తి బైటపారబోయటానికి నడుం వంచలేని బద్ధకస్తుడు.

ఇరవై ఫ్లాట్లలో వుండే వాళ్ళ ఎక్కువ మంది ఉద్యోగస్తులే వ్యాపారస్థులు కొద్ది మంది వున్నారు. అందరూ కూడా చీటికి మాటికి గొడవలు పడని మర్యాదస్తులు, సర్దుకుపోయే మనస్తత్వమే ఎక్కువ మందికి వున్నది. అపార్ట్‌మెంట్‌లో ఏ అవసరం వచ్చినా ఏ రిపేరు చేయించాల్సి వచ్చినా అందరూ కూర్చుని చర్చించుకుని సంయమనంగా వ్యవహరిస్తూవుంటారు.

పక్కనున్న అపార్ట్‌మెంట్‌లు నలభై ఫ్లాట్లున్నాయి. అక్కడా ఒక్క వాచ్‌మేనే ఉన్నాడు. రాత్రి బంగళ్ళు ఒక్కడే చూసుకోవాల్సిన పరిస్థితి. చుట్టు పక్కల ఒకరిద్దరు వాచ్‌మెన్ల్ సుబ్బారావుకు పని తక్కువ జీతమెక్కువ సుఖంగా తిని తిరుగుతున్నాడు అని అనుకుంటూ వుంటారు.

ఒక రోజు అచ్చయ్య బండెక్కి రోడ్డు మీద గంటలకొద్దీ తిరుగుతూ సుబ్బారావు ఫ్లాట్ వాళ్లకు కనిపించాడు.

"ఎవర్నడిగి బయటకు వెళ్తున్నావు! సుబ్బారావ్ నీ ఇష్టం వచ్చినట్లు బయట తిరిగి వస్తే కుదరదు. కరెంటు పోతే జనరేటర్ ఎవరేస్తారు! సమయానికి నీళ్ల మోటారు వెయ్యకపోతే అందరూ ఇబ్బంది పడతారు"అని అడిగితే "చిన్న పనివున్నది త్వరగా వచ్చేద్దామని వెళ్లానండీ. కూరగాయలు సరుకులూ తెమ్మంది రంగమ్మ" అంటూ చెప్పేవాడు. కాని అప్పటికే మనిషి తూలుతూ వుండేవాడు.

మధ్యాహ్నం పూట అంత ఎక్కువగా ఎవరూ సెల్లార్‌లోకి వచ్చేవాళ్ళు కాదు. కాస్త నిశ్శబ్దంగా ఉండేది. అచ్చయ్యకూ, సుబ్బారావుకూ సమయం అనుకూలంగా వుండేది. ఎవరికీ అనుమానం రాకుండా వాచ్‌మెన్ క్వార్టర్ లోపల చేరి తమ తాగుడు కార్యక్రమం కానిచ్చేవాళ్లు. విషయం తెలిసి సుబ్బారావుకూ అచ్చయ్యకూ వార్నింగ్ ఇచ్చారు. వాళ్లు మాత్రం తప్పు ఒప్పుకోలేదు. "ఎండగా వుందని కూల్‌డ్రింక్ తాగామండి, మా మీద ఎవరో మీకు చాడీలు చెప్తున్నారు అంతే" అంటూ బుకాయించారు. అచ్చయ్య బాగా వినయంగా మాట్లాడుతాడు. ఇస్త్రీ అంతకంటే బాగా చేస్తాడు. అతని విషయంలో కూడా కొంచెం ఓపిక పడదామని ఆలోచిస్తున్నారు.

" రేయ్ భాస్కర్ ఇవ్వాళ ఆదివారం స్కూల్‌కు శెలవేగా. అపార్ట్‌మెంట్ అంతా శుభ్రం చెయ్యి, మొక్కలన్నింటికి నీళ్ళు పెట్టు" అంటూ కొడుక్కి ఆర్డర్లు వేసేవాడు సుబ్బారావు. "అమ్మాయ్ లక్ష్మీ! అమ్మ వచ్చేటప్పటికి గిన్నెలన్నీ కడుగు. బట్టలుతుకు అన్నం కూడా వండు" అంటూ కూతుర్ని కూడా ఊపిరి తీసుకోనిచ్చే వాడుకాదు. "సుబ్బారావన్నా! వాళ్ళు చిన్నపిల్లలు. పిల్లల్ని మరీ చెండుకు తినబాకు" అంటూ అచ్చయ్య అనేవాడు.

"పిల్లల్ని చదువుకోనియ్యవా! కూర్చున్న చోటు నుండి కదలకుండా అందరికీ పనులు చెప్తావు. రాత్రి పొద్దు పోయాక కూడా ఆ లైటు తియ్యి ఈ గేటు వెయ్యి అంటూ పిల్లల్ని చంపుకు తింటున్నావు" అంటూ రంగమ్మ మొత్తుకునేది.

◆ ◆ ◆

ఆ రోజు సాయంత్రం అపార్ట్‌మెంట్ కమిటీ మీటింగు వేసి అందరికీ కబురు పెట్టారు. రంగమ్మ పిల్లలూ ఒక పక్కన కూర్చుని వున్నారు. సుబ్బారావు జాడేమి తెలియలేదు.

మరొక వాచ్‌మెన్‌ను పెట్టుకోవాల్సిందే! వీడితో ఇక లాభం లేదు అని ఎక్కువ మంది అభిప్రాయపడ్డారు.

మరొకళ్ళు దొరికే వరకు తను అపార్ట్‌మెంట్‌ను కనిపెట్టుకుని వుంటనన్నాడు అచ్చయ్య. అయ్యా నా దొక మాట. సుబ్బారావును పనిమాన్పిద్దామనుకుంటున్నారు గదా! మా వాడొకడున్నాడు. నమ్మకంగా పడి ఉంటాడు మీరు సరేనంటే రేపే పనిలో పెడ్తాను"అని అడిగాడు.

"ఒకటి రెండు రోజులు నువ్వు చూడు రంగమ్మ, పిల్లలూ వుండనే వున్నారు. ముందు సుబ్బారావు ఏమయ్యాడో తెలుసుకోవాలి అది ముఖ్యం" అని పెద్దలు చెప్పి వెళ్లిపోయారు. "మర్నాడు పొద్దునే రంగమ్మ ప్రొఫెసర్ రావు గారింటికి పనిచేయటానికి వచ్చింది. "అయ్యగారు మీరు కొంచెం పట్టించుకోండి. మా ఆయన అట్లా చెప్పకుండా వెళ్లే మనిషి కాదు. ఎవరో చెప్పి తీసుకెళ్ళుంటారు. తాగుడు కూడా చాలా తగ్గిపోయింది. ఇదివరకట్లా తాగటం లేదు. నిన్న సాయంత్రం మా చుట్టాలింటికి వెళ్లాడట. ఇక్కడి సంగతులు తెలుసుకోవటానికి మా ఆయన వాళ్లకు ఫోన్ చేశాడని చెప్పారు. గరువు పాలెం వాళ్ళ ఫోన్ నెంబరు నా దగ్గరుంది. కాస్త దయచేసి మీ రొక్కసారి ఫోన్ చెయ్యండి. ముందు మా ఆయన్ని ఇక్కడకు వచ్చేయ్యమని చెప్పండి. మీరు చెప్తే వింటాడు." అంటూ ప్రాధేయపడింది.

ఫోన్ దగ్గరకు సుబ్బారావును పిలిపించుకుని రావుగారు నచ్చ చెప్పారు. రావటానికి కొంచెం జంకాడు.



రంగమ్మే వెళ్ళి గరువుపాలెం నుండి సుబ్బారావును తీసుకుని వచ్చింది. విషయమేమిటంటే "పదివేలు నాకిచ్చెయ్. కొత్త ఇస్త్రీ బండి ఇస్త్రీ పెట్టే తీసుకోవాలి. డబ్బు తక్కువుంది కావాలంటే నీకు రోజువారి వడ్డీ కూడాఇస్తాను. అపార్ట్ మెంట్‌లో ఒకటి రెండు రోజులు డబ్బులు ఆలస్యంగా ఇచ్చినా పెద్దగా ఎవరూ పట్టించుకోరు. భయపడాల్సింది ఏమీ లేదు. నువ్వు నాలుగు రోజులు ఎటైనా వెళ్ల ఈలోగా నేను డబ్బు సర్దుబాటు చేసి అప్పజెప్తాను. నా పేరు మాత్రం బయటకు రానివ్వకు" అని అచ్చయ్య సలహా ఇచ్చాడట. పదివేలల్లో ఒక

అయిదు వందలు ఆ రోజు రాత్రి గరువుపాలెంలో తాగేశాడు. తొమ్మిదిన్నర వేలు అచ్చయ్య జేబులోకి వెళ్ళాయి. సుబ్బారావుని దాక్కోమని పంపించి వేశాడు. తర్వాత తన తమ్ముణ్ణి అపార్ట్‌మెంట్ పనికి కుదురుస్తానని అచ్చయ్య చెప్తున్నాడు. అంతే కాక తొమ్మిదిన్నర వేల సంగతి కూడా తనకేమి తెలియదంటున్నాడు.

రంగమ్మ, సుబ్బారావుని పిచ్చివాణ్ణి చేసి అచ్చయ్య నాటకమాడాడని అర్థమయింది. "నేను మనవాళ్లతో మాట్లాడతాను. సుబ్బారావ్! నువ్వు ఉమ్మడి డబ్బు వాడేశావు. వసూలు చేసింది నువ్వే. అప్పజెప్పే బాధ్యత నీదే. ఆ డబ్బును నువ్వే తీర్చాలి. రంగమ్మ జీతాల్నుంచి ఎవరూ మినహాయించుకోరు. అందుకిష్టమయితే నీకొక అవకాశం ఇమ్మని మన వాళ్లకు చెప్తాను." అన్నారు రావుగారు. "అయ్యా నా జీతం రెండు నెలలు చెల్లు చేసుకోండి!" "అప్పటి దాకా ఆగటం కుదరదు. సుబ్బారావ్ జీతం చెల్లుబెట్టడం జరగదు. కష్టపడి పనిచేసి బాకీ తీర్చు. ఇది కూడా నిన్ను చూసి కాదు నీ పెళ్లాం, పిల్లల ముఖం చూసి నిన్ను వదిలి వేయాల్సి వస్తుంది. పోలీసు కేసు పెట్టకుండా."అని కచ్చితంగా చెప్పేశాడు."ఇక్కడ అపార్ట్‌మెంట్ పనేగా నేను చేసేది. ఇంకా వేరే ఏం కష్టం చేస్తాను! అయ్యగారు..అని సుబ్బారావు బాధపడితే "మన పక్కన ఖాళీ స్థలంలో మరో చిన్న అపార్ట్‌మెంట్ కట్టబోతున్నారు నువ్వు రోజువారీ కూలీగా పగలు అక్కడ పనిచేయ్. రోజుకు మూడు వందలిస్తారు. వేసవి సెలవులు కాబట్టి నీ కొడుకు ఇంటి దగ్గరే వుంటాడు. మన అపార్ట్‌మెంట్ పనులు చేస్తాడు. పదివేలు జమ అయ్యే వరకు నువ్వు అక్కడ పనిచెయ్యి. మేస్త్రీతో నేను మాట్లాడతాను. వారానికొకసారి నీ జీతమంతా మన అపార్ట్‌మెంట్ కమిటీకి ఇవ్వమని చెప్తాను. బాకీ తీరిన తర్వాత నీ ఇష్టమయితే ఇక్కడ పని చేయ్ లేదా వెళ్ళి పోదువుగాని" అని పెద్దాయన సలహా ఇచ్చాడు. సెల్లార్‌లో నీడన కూర్చుని సెల్‌ఫోన్‌లో పాటలు వింటూ కులాసాగా తిరిగే సుబ్బారావుకు సున్నం బొచ్చెలు మోస్తూ పగలంతా పనిచెయ్యటం మొదట్లో కష్టమే అనిపించింది ఒక వారానికి కాస్త అలవాటు పడ్డాడు. "పగలంతా కష్టపడుతున్నావు సాయంత్రం కొంచెం మందు తాగుతావా! ఒళ్ళు నొప్పులు కొంచెం తగ్గుతాయి. పిల్లాడి చేత పకోడీలు తెప్పిస్తాను. తిందువుగాని" అంటూ రంగమ్మ పరామర్శించేది. తాగాలని మనసు పీకినా రంగమ్మ చేత తాగుడుకు ఖర్చు పెట్టించకూడదు. తొందరగా బాకీ తీర్చేయాలి అని ఆలోచించుకునేవాడు. మళ్లీ నమ్మకం కలిగించాలి. ఇక్కడే వాచ్‌మెన్‌గా పనిచెయ్యాలి. అచ్చయ్యలాంటి వాళ్లను దూరంగా పెట్టాలి అని నిశ్చయానికొచ్చాడు సుబ్బారావు. ✦

శరణార్థి క్షోభ

◆ తమ దేశంలో సంఘర్షణలు, పోరాటాలు, ప్రమాదాల వల్ల నివాసాలను వదిలి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లే ప్రయత్నంలో కోట్లాది మంది ఎదుర్కొన్న కష్టాల్ని, బతుకుపై వారి ధృఢ నిశ్చయాన్ని, అడుగడుగునా ఎదురైన ఇబ్బందుల్లో వారు ప్రదర్శించిన ధైర్యాన్ని అందరికీ తెలియజెప్పేందుకు ఐక్యరాజ్య సమితి 2000 నుండి ప్రపంచ శరణార్థుల దినోత్సవాన్ని జూన్ 20న నిర్వహిస్తోంది.

◆ వివిధ దేశాల్లో శరణార్థులుగా ఉన్న వారిలో దాదాపు 50 శాతం మంది 18 సంవత్సరాల లోపు వారే.

◆ ప్రపంచ వ్యాప్తంగా వలస బాట పట్టినవారు 24 కోట్ల 40 లక్షల మందికిపైగా ఇతర దేశాలకు తరలి వచ్చిన వారని అంచనా.

◆ రోహింగ్యాలు మయన్మార్‌లో నివసిస్తున్న మైనారిటీ ముస్లిమ్‌లు. వీళ్లు 19వ శతాబ్దంలో బ్రిటీష్ పాలన ఉన్నప్పుడు ఆ ప్రాంతానికి వచ్చారు. గత నాలుగేళ్లలో లక్షా 20 వేల మంది రోహింగ్యాలను మయన్మార్ నుండి నౌకల ద్వారా ఇతర దేశాలకు తరలించడానికి హ్యూమన్ ట్రాఫికర్లకు ప్రభుత్వం భారీ మొత్తంలో డబ్బు చెల్లించినట్టు ఆరోపణలున్నాయి.

◆ సిరియాలో చోటుచేసుకున్న పరిస్థితుల కారణంగా సుమారు కోటి 35 లక్షల మందికి పైగా చెదిరిపోయారని 2016 ఫిబ్రవరి వరకు ఐరాస లెక్కలు.

◆ అంతర్జాతీయ చట్టాల ప్రకారం శరణార్థులను బలవంతంగా వారి దేశాలకు తిరిగి పంపడం చట్ట విరుద్ధం.

◆ 17 లక్షల మంది సిరియన్ శరణార్థులతో టర్కీ ప్రపంచంలోనే అతి పెద్ద శరణార్థుల నిలయంగా నిలిచింది.

◆ లెబనాన్‌లోని ప్రతి ఐదుగురిలో ఒకరు సిరియా శరణార్థి ఉన్నారు.

◆ అభివృద్ధి చెందుతున్న దేశాలు శరణార్థులకు 86 శాతం ఆశ్రయాన్నిస్తున్నాయి.

మీల్‌మేకర్ పకోడి



కావాల్సిన పదార్థాలు

మీల్‌మేకర్ -1కప్పు, గరమ్‌మసాలా-1/2 టేబుల్ స్పూన్, కారం- 1/2 టేబుల్ స్పూన్, ఉప్పు- తగినంత
బియ్యప్పిండి/ సెనగపిండి- 1కప్పు
బియ్యప్పిండి- 3 టేబుల్ స్పూన్లు
అల్లం,వెల్లుల్లి పేస్ట్- 1/2టేబుల్ స్పూన్
జీలకర్ర- 1/2 టేబుల్ స్పూన్
పసుపు- చిటికెడు, నీరు -తగినంత
ఉల్లి పేస్ట్-2 టేబుల్ స్పూన్లు, నూనె- సరిపడా

తయారుచేసే విధానం

ముందుగా ఒక పాత్రలో నాలుగు కప్పులు నీరు పోసి వేడిచేసి అందులో మీల్‌మేకర్‌ని వేయాలి. 10 నిమిషాల తర్వాత మీల్‌మేకర్‌ని వేడి నీటి నుండి తీసి చల్లటి నీటిలో 5 నిమిషాల పాటు ఉంచి నీరు లేకుండా ఒక ప్లేట్‌లోకి తీసి పక్కన పెట్టుకోవాలి. తర్వాత ఒక బౌల్‌లో సెనగపిండి, అల్లం వెల్లుల్లి పేస్ట్, జీలకర్ర, ఉప్పు, పసుపు వేసి బాగా కలుపుకోవాలి. తర్వాత బియ్యప్పిండి కారం కూడా వేసి నీళ్లతో కొద్దిగా పల్చగా ఉండేలా కలుపుకోవాలి. ఇప్పుడు స్టౌపై బాణలి పెట్టి అందులో నూనె వేసి వేడెక్కిన తర్వాత మీల్‌మేకర్‌ని సెనగపిండి మిశ్రమంలో ముంచి నూనెలో వేసి వేయించాలి. బంగారు రంగువచ్చే వరకు ఉంచి తర్వాత ఒక ప్లేట్‌లో టిష్యూ పేపర్‌పై మీల్‌మేకర్ పకోడీలను ఉంచితే నూనెను పీల్చుకుంటుంది. పకోడీలు సాస్‌తో తింటే రుచిగా ఉంటాయి.



చట్‌పటా రింగ్స్

కావాల్సిన పదార్థాలు

చాట్ మసాలా-1/2 టేబుల్ స్పూన్
కారం-1/4 టేబుల్ స్పూన్
పంచదార-1 టేబుల్ స్పూన్
ఉప్పు-తగినంత, మైదా-1/4 కప్పు
మొక్కజొన్న పిండి- 1/2 కప్పు
నూనె-3 టేబుల్ స్పూన్లు

తయారుచేసే విధానం

ముందుగా ఒక బౌల్ తీసుకుని అందులో మొక్కజొన్న , మైదా, ఉప్పు, కారం, పంచదార, నూనె వేసి గోరువెచ్చని నీళ్లతో బాగా కలిపి పక్కన పెట్టుకోవాలి. 10 నిమిషాల తర్వాత ఈ మిశ్రమంలో కొద్దిగా నూనె వేసి మరికొంచెం మెత్తగా ఉండేలా కలుపుకోవాలి. తర్వాత పిండిని చిన్న ఉండలు చేసి ఒక ప్లేట్‌లో పెట్టాలి. ఒక్కో ఉండని వత్తి చక్రాల్లా చేసుకోవాలి. ఇప్పుడు ఒక బాణలిలో కొద్దిగా నూనె వేసి వేడెక్కిన తర్వాత చక్రాల్లా చేసిపెట్టుకున్న వాటిని ఒక్కొక్కటిగా వేసి బంగారు రంగు వచ్చే వరకు వేయించాలి. అన్నింటినీ వేయించిన తర్వాత చాట్ మసాలా, ఉప్పు చల్లి వేడివేడిగా అందించండి.

బ్రెడ్ రోల్స్

కావాల్సిన పదార్థాలు

బ్రెడ్ ముక్కలు -10
వెన్న -1టీ స్పూన్
నూనె-2 టేబుల్ స్పూన్లు
ఉల్లిపాయతరుగు- 3 టేబుల్ స్పూన్లు
క్యాప్సికమ్ తరుగు- 3 టేబుల్ స్పూన్లు
క్యారెట్ తురుము- 2 టేబుల్ స్పూన్లు
క్యాబేజ్ తరుగు- 1/4 కప్పు
నూడిల్స్ ఉడికించినవి- 1/2 కప్పు
పనీర్ ముక్కలు-1/4 కప్పు
సోయా సాస్-1 టేబుల్ స్పూన్
పంచదార-1టీ స్పూన్
ఉప్పు-తగినంత
మిరియాల పొడి-కొద్దిగా

తయారుచేసే విధానం

ముందుగా స్టౌపై పాన్ పెట్టి కొంచెం నూనె వేసి వేడెక్కనివ్వాలి. తర్వాత ఉల్లి తరుగు, క్యాప్సికం, క్యారెట్, క్యాబేజ్ తరుగు, ఉప్పు వేసి 10 నిమిషాల పాటు మగ్గనివ్వాలి. తర్వాత ఉడికించి పెట్టుకున్న నూడిల్స్, సోయా సాస్, పంచదార, ఉప్పు, మిరియాల పొడి వేసి బాగా కలిపి 2 నిమిషాల పాటు ఉడకనివ్వాలి. ఈ మిశ్రమాన్ని ఒక బౌల్‌లోకి తీసి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు బ్రెడ్ ముక్కల్ని చపాతీలు వత్తే కర్రతో ఒక్కో స్లైస్‌ని పొడవుగా వత్తి ఒక ప్లేట్‌లో పెట్టాలి. ఒక్కో బ్రెడ్ స్లైస్‌లో ఉడికించిన క్యాప్సికం, క్యాబేజ్ మిశ్రమాన్ని పెట్టి రోల్ చేసి కొద్దిగా నీటితో బ్రెడ్ చివర్లని గట్టిగా ప్రెస్ చేయాలి. ఒక్కో బ్రెడ్ రోల్ పై కొద్దిగా వెన్న రాసి పాన్‌పై గోధుమరంగు వచ్చే వరకు రోల్‌ని వేయించాలి. ఇప్పుడు సర్వింగ్ ప్లేట్స్‌లో వేడి వేడి బ్రెడ్ రోల్స్‌ని వేసి సాస్‌తో సర్వ్ చేయండి.





పూరించండి

ఇక్కడున్న బొమ్మల ఆధారంగా వాటి ఎదురుగా ఉన్న అక్షరాల్లో ఏ అక్షరం ఏ పదం దగ్గర వస్తుందో గుర్తించి ఖాళీల్ని పూరించండి.

	car	•	d
	__og	•	c
	__ag	•	l
	__amp	•	b

జ: car, dog, bag, lamp

లిటిల్ స్టార్

హాయ్ ఫ్రెండ్స్ నేనొక స్టార్‌ని! ఇది నా చిన్ననాటి ఫోటో ఇంతకీ నేనెవరో చెప్పండి?

జ: [illegible]

నీడతో బొమ్మ

పిల్లలూ మీకు నీడతో ఏర్పడిన బొమ్మలంటే భలే ఇష్టం కదూ. చేతి వేళ్లతో పక్షి బొమ్మ ఎలా చేయాలో మీ కోసం ఇక్కడిచ్చాం. చీకటి గదిలో చిన్నపాటి వెలుగులో మీరూ ప్రయత్నించండి.



చుక్కలు కలపండి



ఎన్నున్నాయి

ఇక్కడ బాక్సుల్లో కొన్ని బొమ్మలనుంచాం! మీరు చేయాల్సిందేంటంటే ఒక్కో వరుసలో ఉన్న ఒకే రకం బొమ్మల్ని కూడి ఆ సంఖ్యను పక్కనున్న బాక్సులో రాసేయండి.

Giraffe		
Zebra		
Tiger		
Wolf		
Bear		

ఏ నీడ ఎవరిది

పిల్లలూ! ఇక్కడ కొన్ని ఆకులు వాటి ఎదురుగా నీడలు ఉన్నాయి. వాటిలో ఏ ఆకు నీడ ఎక్కడుందో గుర్తించి జతచేయండి.



బుజ్జి పాండా కావాలా!

చేసేద్దాం

పిల్లలూ! మీరు కార్టూన్ చానెళ్లల్లో సినిమాల్లో పాండాల్ని చూసే ఉంటారు. వాటిని మీ చిట్టి తమ్ముళ్లు, చెళ్ళెళ్లు కూడా ఎంతో ఇష్టపడుతుంటారు. బయట షాపుల్లో దొరికే కొన్ని వస్తువులతో వాటిని ఎలా తయారు చేయాలో మేం నేర్పిస్తాం. జాగ్రత్తగా తయారుచేసి తమ్ముళ్లు, చెళ్ళెళ్లకు అందించండి.

కావాల్సిన వస్తువులు

పేపర్ కప్–1, ప్లాస్టిక్ బాల్–1, తెల్లరంగు పెయింట్, గమ్, గాగుల్ ఐస్ (బొమ్మలకి వాడే కళ్లు), పాంపామ్‌లు–2, నల్లరంగు ఫెల్ట్‌లు–2, నల్లరంగు మార్కర్–1

తయారుచేసే విధానం

ముందుగా కప్ అడుగు భాగంపై ప్లాస్టిక్ బాల్‌ని అతికించి రెండిటికి తెల్ల పెయింట్ వేసి కొంతసేపు ఆరనివ్వాలి. ఇప్పుడు బాల్‌పై భాగంలో పాంపామ్స్‌ని అతికించాలి. రెండు ఫెల్ట్‌లని తీసుకుని గుండ్రంగా కత్తిరించి పక్కన పెట్టుకోవాలి. ముక్కు భాగం కోసం త్రికోణంలో మరో ముక్కని కత్తిరించుకోవాలి. గుండ్రంగా కత్తిరించి పెట్టుకున్న ఫెల్ట్‌లపై గాగుల్ ఐస్‌ని అతికించాలి. బాల్‌పై పాండా కళ్లనుగీసి దానిపై గాగుల్ ఇస్‌ని అతికించాలి. బాల్‌పై మార్కర్‌తో ముక్కు ఆకారాన్ని గీసి దానిపై త్రికోణంలో కత్తిరించిన ఫెల్ట్‌ని అతికించాలి. ఇప్పుడు బొమ్మలో చూపిన విధంగా ఫెల్ట్‌ని కత్తిరించి చేతులు కాళ్ల భాగంలో అతికిస్తే పాండా బొమ్మ రెడీ!

పదవికాసం - 20

కూర్పు: టి.డి. ప్రసాద్

1	2		■	3		■	4		■
5		■	6		■	7		■	8
	■	9		■	10		■	11	■
12	13		■	14		■	15	■	16
■	17				■	18	■	19	
20	■		■	■	21		■	22	
■	23		24	25		■	26		■
27		■	28			29	■	■	30
	■	31			■	32	33	34	
35					■	36			

ఆధారాలు

అడ్డం

1. గుడ్డు (3)
3. జిల్లాలు కలిపి రాష్ట్రం, రాష్ట్రాలు కలిపి -- (2)
4. భంచిక్ భంచిక్ చెయ్యి బాగా వంటికి -- మంచిదేగా .. రమ్యకృష్ణ వ్యాయామ పాట(2)
5. జవాబు ఒప్పు కాదు (2)
6. -- సింగిల్‌గా వస్తుంది.. పందులే గుంపులుగా వస్తాయి. రజనీకాంత్ డైలాగ్ (2)
7. శుక్రవారానికి మొన్న (2)
8. ప్రొప్రయిటర్ ప్లేయర్లను కొనుగోలు చేస్తారు మొదట (1)
9. మెడలో వేసుకునే ఆభరణం (2)
10. 'ఆడ' జింక (2)
11. గెలుపు కోసం కష్టపడతారు ఆటగాళ్లు 'ఆరు'లో (1)
12. అటు నుంచి పదిలం (3)
14. విరోధం, శత్రుత్వం (2)
15. పాయింటు కోసం బరిలో పోరాటమే ఆరులో (1)
17. సాగుకు సన్నద్ధం, దుక్కి ప్రారంభం (4)
19. బన్నపదు అంటే భంగపదు. అది చివర్లో లేదు (2)
20. అడ్డం 8,11,15 కలిపితే కాలితో తన్ని, చేతితో లాగే చెడుగుడు ఆటే.. (1)
21. రమ్మంది నిన్ను కాదు (2)
22. ముగించు, చాలించు (2)
23. మం-ర-వ్య.. ఆ పువ్వేమిటి? (5)
26. చైనా కమ్యూనిస్టు సిద్ధాంత కర్త (2)
27. గోదావరి ఒక -- (2)
28. సమస్తము సరిగా లేదు (4)
31. కాగులో అటు నుంచి చూడండి (3)
32. అటు నుంచి వచ్చి 'కనబడి' (4)
35. వాదులాటలు (5)
36. వర్షరుతువు (4)

నిలువు

1. తెలుగు ఇంటర్నెట్ (4)
2. తప్పెట (2)
3. శరీరం (2)
4. యోధుడు, అంగరక్షకుడు (2)
6. సింగమలై చివర్లో లేదు (2)
7. మూడైనా లేని 'బుడిగి' (2)
9. పదారు సదనములు 6,1,3,4,2 (5)
10. దూడ, పెయ్య (2)
13. కింది నుంచి ఏది? (2)
14. తెలపక ద్వితీయార్థం (2)
16. తండ్రుల దినోత్సవం రోజు ఎవరు గుర్తుకు వస్తారు? (3)
18. ఆంగ్లంలో ట్యాక్స్, తెలుగులో దంతం అనే మరో అర్థం (2)
19. హిందీలో రక్షించండి (3)
21. ఏడవకు వ్యతిరేకం (3)
23. జనసమూహం, పరివారం (2)
24. తియ్యని రసంలో కలుపుకు తినే స్వీటు (4)
25. బడులు తెరిచాక చదివేందుకు పిల్లలకిచ్చేవి (4)
27. మధ్య (3)
29. తొడిమ కింది నుంచే ఉంటుంది (3)
30. రొట్టెల తయారీ శాల (3)
31. లోగుట్టు చివర్లో ఎవరికి ఎరుక (2)
33. బలపం చివర విరిగి పోయింది (2)
34. నకనక యాభై శాతమే (2)

సుడోకు

			3		1	5		
	2	3			5	4		9
4	6	5		7		8		
	3		2			9	4	7
				8				
6	5	4			9		3	
		9		2		1	6	4
7		2	6			3	8	
		6	1		8			

గతవారం జవాబులు

5	6	7	1	8	9	4	2	3
8	4	3	2	5	6	7	9	1
9	1	2	3	7	4	6	5	8
3	5	6	8	1	2	9	4	7
4	8	9	5	6	7	1	3	2
2	7	1	9	4	3	5	8	6
1	9	4	6	2	8	3	7	5
6	3	8	7	9	5	2	1	4
7	2	5	4	3	1	8	6	9

1 కూ	2 చి	3 పూ	డి	■	4 చే	5 గు	6 వే	రా	■
7 త	ల్లి	లు	■	8 ఆ	ట	లా	డు	■	9 ది
10 వే	లు	■	11 మీ	ది	■	బీ	■	12 క	ర
టు	■	13 జ	నం	■	14 జ్వ	■	15 న	మ	స్కా
■	16 ఒ	ట్టు	■	17 తా	ర	క్	■	18 నీ	రం
19 న	టి	■	20 శ	క	ము	■	21 భ	యం	■
■	22 క	23 ను	క	ట్టు	■	24 ని	ద్ర	■	25 పా
26 ర	■	27 జ	లం	■	28 స	త్యం	■	29 శా	■
■	30 తాం	డ	■	31 గో	లు	■	32 ల	■	33 కా
34 బై	బై	■	35 దూ	డ	బా	తు	■	36 పా	కి

మనసు తడిమే చిత్రాలు



ఓ అంధ వ్యక్తి ఓ ఆర్ట్ గేలరీకి వచ్చాడు. అందరూ ఆశ్చర్య పోయారు ఆయనేం కళాఖండాల్ని చూడగల రని. ఆ వ్యక్తి ఆండ్రూ మైయెర్స్ ప్రదర్శన వద్దకు వెళ్ళాడు. తన చేతితో ఓ పొట్రెయిట్‌ను తడిమాడు. కొన్ని క్షణాల తర్వాత ఆ వ్యక్తి కళ్లెంట నీరు ధారలు కట్టాయి. కళా వివశుకు లోనయ్యాడు. ఎక్కడైనా ప్రదర్శితాల్ని ముట్టు కోవద్దని విజ్ఞప్తులుంటాయి. కానీ ఆండ్రూ తన సృజనను తడిమి చూడాలని అంధ వ్యక్తిని కోరు కున్నాడు. కార ణం.. తాను సృజిచింది వేలాది స్క్రూలను బిగించి రూపొందించిన పొట్రెయిట్‌లు. ఇవి 3డి ఆకృతిలో ఉంటాయి. వాటిని తడిమితే ఓ మనిషి ముఖాన్ని తాకినట్టే ఉ ంటుంది. అందుకే ఆ అంధ వ్యక్తి ఆ కళాఖండాల్ని చూడగలి గాడు. జర్మనీలో పుట్టి స్పెయిన్‌లో పెరిగిన ఆండ్రూ మైయెర్స్ ప్రస్తుతం కాలిఫోర్నియాలో తన కళాలోకాన్ని ఆవిష్కరిస్తున్నాడు.





ADITYA

GROUP OF ENGINEERING, PHARMACY & MANAGEMENT COLLEGES

1984-2016 · 32 YEARS OF EXCELLENCE

ADB ROAD, SURAMPALEM - KAKINADA, CELL : 70950 76663, 76664, 76665 aditya.ac.in

ADITYA GLOBAL BUSINESS INCUBATION CENTER FOUNDATION STONE LAID BY

Sri Dr.Y.S.Chowdary, Hon'ble Minister of State, Science and Technology & Earth Sciences, Govt. of India.

INDIA'S FIRST Microsoft Ed-Vantage Platinum Campus

Microsoft INNOVATION CENTER

Adobe acta Adobe Creative Technology Academy

COURSES OFFERING :

DIPLOMA - CIVIL, MECH, ECE, EEE, CME, PET

B.TECH - CIVIL, MECH, ECE, EEE, CSE, IT, PETROLEUM, MINING, AGRICULTURE

B.Pharmacy, Pharm D, BBA

Post Graduation courses

M.TECH, M.PHARM, PGDM, MBA, MCA

RANKINGS & RATINGS

GRADE AA+ CAREERS360

ONE of the INDIA'S Best — THE SUNDAY INDIAN

SOUTH ZONE 4th RANK — DIGITAL MUSERS

South INDIA TOP RANK 6 siliconindia

14th Rank in A.P. — THE TIMES OF INDIA

13 RANK out of Top 25 Engg. Colleges in INDIA 4Ps

29th Rank in India — HIGHER EDUCATION

& more...

Campus Highlights

- Discipline is the hallmark
- A huge campus situated in 180 Acres
- Green zone with zero percent pollution
- Concentrated effort in the learning process
- Separate blocks for Juniors' Class Work
- Periodical feedback from the students
- Industry oriented teaching
- E-classrooms
- WiFi Campus
- Project Clubs
- AC Seminar halls
- Open Air Theatre
- Girls waiting halls
- AC / Non-AC Hostels

SEPARATE HOSTEL FOR BOYS & GIRLS



ADITYA - SYNONYM FOR PLACEMENTS

1080 PLACEMENTS

75 COMPANIES in 2015-16

Hounoured with **BEST PLACEMENT AWARD** from Govt.of A.P.

BEST PERFORMANCE AWARD from TECH MAHINDRA for outstanding achievement in Campus Placemets

adityaedugrp adityaedugrp YouTube adityasurampalem Instagram adityasurampalem

Check List

Book Number	KNSR02B126	**Date**	03/09/22
Front Cover	yes	**Back Cover**	yes
Blank Pages	No		
Missing Pages	No		
Prepared By	Mouni	**Cutting By**	Mouni
Scanned By	Sameera	**Pages**	29